News Daily
ఎడిటర్ : B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in : www.cknewstv.in

# CK NEWS
చంద్ర కాంత్
తెలుగు దినపత్రిక

Website cknewstv.in

సంపుటి : 02 | సంచిక :216 | ఖమ్మం | శనివారం, సెప్టెంబర్ 21, 2024 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## సింగరేణి కార్మికులకు రూ.796 కోట్ల దసరా బోనస్

- ఒక్కో శాశ్వత ఉద్యోగికి సగటున రూ.1.90 లక్షలు
- తొలిసారిగా ఒప్పంద కార్మికులకూ రూ.5 వేల చొప్పున అందజేత



సింగరేణి కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీపి కబురు అందించారు. గతేడాది సంస్థ ఉత్పత్తి, గడించిన లాభాల ఆధారంగా దసరా బోనస్‌ను ప్రకటించినట్లు సీఎం వెల్లడించారు. ఒక్కో కార్మికునికి సగటున రూ.1.90 లక్షల చొప్పున బోనస్ అందజేయనుండగా.. తొలిసారిగా సంస్థలోని ఒప్పంద కార్మికులకు ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

వివరాలు 2లో..



# హైడ్రాకు సర్వాధికారాలు

## చట్టబద్ధత కల్పించాలని మంత్రివర్గం తీర్మానం

- డిప్యుటేషన్‌పై 169 మంది అధికారులు, 940 మంది పొరుగు సిబ్బంది
- ఓఆర్‌ఆర్ లోపలున్న చెరువులు, కుంటలు దీని పరిధిలోకి
- ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం ఎలైన్‌మెంట్ ఖరారుకు కమిటీ
- ఈ ఖరీఫ్‌లో పండే సన్న ధాన్యం కొనుగోలుకు రూ.500 బోనస్
- ఎస్‌ఎల్‌బీసీ సొరంగం పనుల పూర్తికి రూ.4,637 కోట్ల మంజూరు
- రాష్ట్ర క్యాబినెట్ కీలక నిర్ణయాలు

హైడ్రాకు చట్టబద్ధతతో సర్వాధికారాలు కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. బాహ్య వలయ రహదారి(ఓఆర్‌ఆర్) లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలతో పాటు వాటి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిరక్షణ అధికారాలన్నీ హైడ్రాకే అప్పగించింది. అన్ని ప్రభుత్వ శాఖల నుంచి డిప్యుటేషన్‌పై 169 మంది అధికారులను, 940 మంది పొరుగు సేవల సిబ్బందిని హైడ్రాలో నియమించడానికి ఆమోదం తెలిపింది. ఇతర శాఖల మాదిరిగా దీనికి అధికారాల్లో పూర్తి స్వేచ్ఛను కల్పించింది. గతంలో మున్సిపాలిటీలు, వివిధ శాఖలకు సంబంధించిన అన్ని అంశాలను హైడ్రాకు అప్పగించింది. ఓఆర్‌ఆర్ లోపల ఉన్న 27 అర్బన్ స్థానిక సంస్థలతో పాటు.. ఇటీవల గ్రేటర్ హైదరాబాద్‌లో చేర్చిన 51 పంచాయతీలు దీని పరిధిలోకి వస్తాయి. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సుమారు 3 గంటల పాటు జరిగింది. నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మీడియాకు తెలిపారు.

**మహిళావర్సిటీకి చాకలి ఐలమ్మ...**

**హ్యాండ్లూమ్ సంస్థకు కొండా లక్ష్మణ్ పేర్లు**

కోఠిలోని మహిళా యూనివర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరును, తెలుగు వర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరును, కొత్తగా ఏర్పాటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. "రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ సంస్థకు మనోహరాబాద్ మండలంలో లాజిస్టిక్ పార్క్ కోసం 72 ఎకరాలు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలో పారిశ్రామిక పార్కుకు 58 ఎకరాలను

వివరాలు 2లో..

# కల్తీ నిజమే

## పంది కొవ్వు, గొడ్డు కొవ్వు కలిశాయని పరీక్షల్లో వెల్లడి

ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెడుతున్నాం

తితిదేకు సరఫరాదారులపై చర్యలు తీసుకుంటాం

ఈవో శ్యామలరావు వెల్లడి



తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వాడే నెయ్యిలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె ఉన్నట్టు 'ఎన్‌డీడీబీ కాఫ్' సంస్థ నివేదికలో వెల్లడైందని తితిదే ఈవో జె.శ్యామలరావు తెలిపారు. నెయ్యి నాణ్యతకు ప్రామాణికమైన 'ఎస్-విలువ' ఒక ఈక్వేషన్ ప్రకారం 97.96 నుంచి 102.04 మధ్య ఉండాల్సి ఉండగా, పరిమితికి మించి 116.09గా ఉన్నట్టు నిర్ధారణ అయిందని వివరించారు. దీన్ని బట్టి ఇందులో పందికొవ్వు ఉన్నట్లు స్పష్టమైందని పేర్కొన్నారు. మరో ఈక్వేషన్ ప్రకారం 95.90 నుంచి 104.10 మధ్య ఉండాల్సిన 'ఎస్-విలువ' అతి తక్కువగా 23.22గా ఉందని.. నెయ్యిలో గొడ్డు కొవ్వు కలిసి ఉన్నట్లు వెల్లడైందని చెప్పారు. దేశంలోనే అత్యంత ప్రఖ్యాత సంస్థ గుజరాత్‌లోని నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) కాఫ్ (సెంటర్ ఫర్ ఎనాలిసిస్

వివరాలు 2లో..

## తిరుమల లడ్డూపై వివాదం.. బాధ్యులపై కఠిన చర్యలు:



అమరావతి: తిరుమల లడ్డూ వివాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఎక్స్'లో ఓ సంస్థ ఫిర్యాదు చేస్తూ పెట్టిన పోస్టుకు ఆయన రిప్లై ఇచ్చారు. ఈ అంశంపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు పవన్ పేర్కొన్నారు. వైకాపా హయాంలో ఉన్న తితిదే బోర్డే ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలన్నారు. తిరుమల లడ్డూలో జంతువుల కొవ్వు వినియోగించడం అందరి మనోభావాలనూ దెబ్బతీసిందన్నారు.

సనాతన ధర్మరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆలయాల్లో జరిగే అంశాల పర్యవేక్షణకు జాతీయ స్థాయిలో 'సనాతన ధర్మరక్షణ బోర్డు' ఏర్పాటు చేయాల్సిన సమయం ఆసన్నమైందని పవన్ అభిప్రాయపడ్డారు. దీనిపై అన్ని వర్గాల వారితో జాతీయస్థాయిలో చర్చ జరగాలన్నారు.

వివరాలు 2లో..

# జానీ నాలుగేళ్లుగా లైంగిక దాడి చేశాడు.. అతనే చెప్పాడు

## జానీ మాస్టర్ రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు వెల్లడించిన పోలీసులు

- 2019లో జానీ మాస్టర్‌తో బాధితురాలికి పరిచయమైనట్లు తెలిపిన పోలీసులు
- దురుద్దేశంతోనే జానీ మాస్టర్ బాధితురాలిని అసిస్టెంట్‌గా చేర్చుకున్నాడని వెల్లడి
- నాలుగేళ్లుగా లైంగిక దాడికి పాల్పడుతున్నాడన్న పోలీసులు
- ఉప్పరపల్లి కోర్టు జానీకి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్

వివరాలు 2లో..



## ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తా... వెనుకడుగు వేసే ప్రసక్తి లేదు

- యువగళం పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తానన్న మంత్రి లోకేశ్
- అభివృద్ధి చేసి చిత్తూరు జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటానని వ్యాఖ్య
- బంగారుపాళ్యంలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి
- రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని వెల్లడి



వివరాలు 2లో..

## దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై తెలంగాణ హైకోర్టులో విచారణ

- దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ 160 ఎకరాలుగా పేర్కొనడంపై ప్రియతమ్ రెడ్డి పిటిషన్
- గత రికార్డుల ప్రకారం 65 ఎకరాలుగా ఉందని పిటిషన్
- విచారణను సోమవారానికి వాయిదా వేసిన హైకోర్టు

వివరాలు 2లో..




## రూ.93 వేల కోట్ల ప్రాజెక్టులో రూ.1 లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగింది?



- కాళేశ్వరం కొట్టుకుపోయిందని కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెడుతున్నారని మండిపాటు
- కాళేశ్వరం కొట్టుకుపోతే మల్లన్న సాగర్ నిండికుండలా ఎలా ఉందని ప్రశ్న
- కాంగ్రెస్ పార్టీది అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్ అని విమర్శ

వివరాలు 2లో..

# అంతా చంద్రబాబు కట్టు కథ..

## తిరుమల లడ్డు వివాదంపై స్పందించిన జగన్

- నెయ్యిలో జంతువుల కొవ్వు అనేది కట్టుకథ అని ఖండించిన వైసీపీ అధినేత
- దశాబ్దాలుగా జరుగుతున్న పద్ధతుల్లోనే తిరుమలలో లడ్డూ తయారీ జరుగుతోందని వ్యాఖ్య
- ఒక ముఖ్యమంత్రి ఇలా అబద్ధాలు ఆడటం ధర్మామేనా అని విమర్శలు



దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన తిరుమల లడ్డూ వ్యవహారంపై ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్పందించారు. లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందనేది ఒక కట్టు కథ అని కొట్టిపారేశారు. దశాబ్దాలుగా జరుగుతున్న పద్ధతుల్లోనే తిరుమలలో లడ్డూ తయారీ జరుగుతోందని అన్నారు. దేవుడిని కూడా రాజకీయాలకు వాడుకునే దుర్మార్గమైన మనస్తత్వం చంద్రబాబుది అని విమర్శించారు. భక్తుల మనోభావాలతో ఆడుకోవడం ధర్మమేనా? అని ఆయన ప్రశ్నించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి నెయ్యి సరఫరా కోసం టెండర్లు పిలుస్తారని, చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే నెయ్యి శాంపిల్స్ తీసుకున్నారని, జులై 23న రిపోర్ట్ వస్తే ఇప్పుడు చంద్రబాబు మాట్లాడడం విడ్డూరం అని మండిపడ్డారు. ఎప్పటిలాగా ఒకే విధానంలో

వివరాలు 2లో..

# సింగరేణి కార్మికులకు రూ.796 కోట్ల దసరా బోనస్

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఈ విషయాలను వెల్లడించారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ.. "తెలంగాణ రాష్ట్ర సాధన ప్రక్రియలో అగ్రభాగాన నిలబడి.. ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లింది సింగరేణి కార్మికులు. వారి శ్రమ, పోరాట పటిమతో తెలంగాణ సాధనలో అత్యంత క్రియాశీలక, ప్రత్యేక పాత్ర పోషించారు. అలాంటి సింగరేణి ఉత్పత్తులు, వ్యాపారంలో వచ్చిన లాభాలను కార్మికులకు పంచడం ద్వారా వారి కుటుంబాల్లో ఆనందాన్ని చూడాలని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది" అని పేర్కొన్నారు.

**లాభాల్లో 33 శాతం బోనస్: ఉప ముఖ్యమంత్రి**

ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. "సింగరేణి సంస్థ రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాలతో పాటు.. పలు సంస్థలకు, ఇతర రాష్ట్రాలకు బొగ్గు ఎగుమతి చేస్తోంది. 2023-24 సంవత్సరంలో సంస్థకు మొత్తంగా రూ.4,701 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులో సంస్థ విస్తరణ, పెట్టుబడులకు రూ.2,289 కోట్లు కేటాయించగా.. మిగిలినవి రూ.2,412 కోట్లు. ఇందులో మూడో వంతు(33 శాతం) రూ.796 కోట్లను కార్మికులకు బోనస్‌గా ప్రకటిస్తున్నాం. సింగరేణిలో 41,387 మంది శాశ్వత కార్మికులు, ఉద్యోగులున్నారు. ఒక్కొక్కరికీ బోనస్ కింద సగటున రూ.1.90 లక్షలు అందించనున్నాం. గతేడాది రూ.1.70 లక్షలు మాత్రమే అందింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న 25 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు చరిత్రలోనే తొలిసారిగా ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. ఒక్కొక్కరికీ రూ.5 వేల చొప్పున బోనస్‌ను అందజేస్తున్నాం.

**విస్తరణే లక్ష్యం..**

సింగరేణి ఆర్జించిన లాభాలను భవిష్యత్ అవసరాలకు తగినట్లు పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించాం. దానిప్రకారం.. సౌర విద్యుదుత్పత్తిని 1000 మెగావాట్లకు విస్తరించడం, రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణం, జైపూర్‌లోని ప్రస్తుత థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రంలో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మరో థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, రామగుండంలో టీఎస్ జెన్‌కో ఆధ్వర్యంలో మరో 800 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, ఒడిశాలోని నైనీ బ్లాక్‌పైన(పిట్‌హెడ్) 2,400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. సంస్థ పరిధిలోని వీకే ఓపెన్ కాస్ట్, గోలేటీ, నైనీ ఓసీలను ప్రారంభిస్తాం. కార్మికులు, ఉద్యోగుల పిల్లల కోసం నూతన రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణతో పాటు.. హైదరాబాద్‌లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం" అని వెల్లడించారు. సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, మక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ప్రేమ్‌సాగర్‌రావు, ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్, షబ్బీర్ అలీ, సింగరేణి ఎండీ బలరాం, కార్మిక సంఘాల నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, జనక్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కల్తీ నిజమే

- మొదటి పేజీ తరువాయి

అండ్ లెర్నింగ్ ఇన్ లైవ్‌స్టాక్ అండ్ ఫుడ్)కు నెయ్యి నమూనాలు పంపించి పరీక్షలు చేయించామని తెలిపారు. తిరుమలలో అదనపు ఈవో వెంకయ్యచౌదరితో కలిసి శ్యామలరావు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మొత్తంగా నెయ్యి స్వచ్ఛతకు సంబంధించి 'ఎస్-విలువ' 95.68 నుంచి 104.32 మధ్య ఉండాల్సి ఉండగా.. చాలా తక్కువగా 20.32 ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని చెప్పారు. చూడటానికి నెయ్యిలా కనిపిస్తుందే తప్ప అసలు అది నెయ్యే కాదని, ఇందులో జంతు కొవ్వులతోపాటు వివిధ రకాల పదార్థాలు కలిశాయనేది తేటతెల్లమైందని పేర్కొన్నారు. మొత్తం నాలుగు నమూనాలకు సంబంధించిన వేర్వేరు నివేదికలు అందాయని, అన్నింటిలోనూ ఒకే తరహా ఫలితాలు వచ్చాయని చెప్పారు. ఈ నెయ్యిని సరఫరా చేసిన తమిళనాడుకు చెందిన ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి జరిమానా విధించే ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు. న్యాయపరమైన చర్యలూ తీసుకుంటున్నామన్నారు.

**నాలుగు ట్యాంకర్ల నెయ్యిలో జంతు కొవ్వులు**

తాను ఈవోగా బాధ్యతలు చేపట్టాక సీఎం చంద్రబాబును కలవగా.. లడ్డూ నాణ్యతపై ఫిర్యాదులున్నాయని, నెయ్యిలో జంతువుల కొవ్వు వాడుతున్నారనే విమర్శలున్నాయని చెప్పారని ఈవో గుర్తు చేసుకున్నారు. 'పోటులో పనిచేసేవారూ నెయ్యి బాగోలేదని చెప్పారు. ప్రధానంగా నెయ్యిపైనే ఫిర్యాదులున్నందున నమూనాలను పరిశీలించాం. సరకు చూస్తే నెయ్యా? లేదంటే నూనెనా? అన్నట్టు ఉండేది. దీనిపై సరఫరాదారులను హెచ్చరించగా సరిదిద్దుకున్నారు. ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సరఫరా చేసిన నాలుగు ట్యాంకర్లలోని నెయ్యి కల్తీ అయినట్లు గుర్తించాం. తితిదే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ నెయ్యి నాణ్యతను పరీక్షించేందుకు జులై 6, 12వ తేదీల్లో ఎన్‌డీడీబీ కాఫ్‌ల్యాబ్‌కు నమూనాలు పంపాం. వారం తరువాత ఫలితాలు వచ్చాయి. పంది కొవ్వు, గొడ్డు కొవ్వుతోపాటు ఇతర పదార్థాలు నెయ్యిలో కలిసి ఉన్నాయని తేలింది. నెయ్యి సరఫరా కోసం మార్చి 12న తితిదే టెండర్లు పిలిచింది. కిలో రూ.320కు అందించేలా మే 8న ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌కు టెండరు ఖరారైంది. మే 15న వారికి సరఫరా ఆర్డరు అందింది. అప్పటినుంచి 15-20 రోజుల తర్వాత ఆ సంస్థ మొత్తం పది ట్యాంకర్ల నెయ్యి పంపింది. ఇందులో ఆరు ట్యాంకర్ల నెయ్యిని తితిదేలో వినియోగించారు.

**రూ.320కే కిలో నెయ్యి సరఫరా ఎలా సాధ్యం?**

నెయ్యిలో కల్తీని పరీక్షించేందుకు తితిదేకు సొంతంగా ల్యాబ్ లేదు. టెండరు షరతుల ప్రకారం బయట ఎన్ఏబీఎల్ గుర్తింపున్న ల్యాబ్‌లో పరీక్షించవచ్చు. అయితే ఎక్కడా పరీక్షలకు పంపించలేదు. కల్తీని పరీక్షించే ల్యాబ్ ఇక్కడ ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించనూ లేదు. దీనికి రూ.75 లక్షలే ఖర్చవుతుంది. ల్యాబ్ లేకపోవటాన్ని సరఫరాదారులు అలుసుగా తీసుకున్నారు. స్వచ్ఛమైన, నాణ్యమైన నెయ్యి అందించాలంటే కొంత ధర ఉంటుంది. అలాంటిది సరఫరాదారులు తితిదేకు కిలో రూ.320 నుంచి రూ.411 ధరకే ఇచ్చారు. ఈ ధరలకు నాణ్యమైన నెయ్యి అందించలేరని నిపుణులు చెబుతున్నారు. మంచి నెయ్యి కావాలంటే ఎంత ధర ఉంటుందో మనందరికీ తెలుసు. తక్కువ ధరకు కొనటం వల్లే నాణ్యత దెబ్బతింది.

**ఆ సంస్థనూ సస్పెండ్ చేశాం**

శ్రీవారి నైవేద్యాల తయారీకి 2021 మే నుంచి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. ఇందులో బియ్యం, ఆవు నెయ్యి, బెల్లం ఒక సంస్థ నుంచి తీసుకుంటున్నారు. దీనివల్ల ప్రసాదం నాణ్యత తగ్గిందనే ఫిర్యాదులొచ్చాయి. వీటిపైనా పరిశీలించాం. నిపుణుల కమిటీ ద్వారా పరీక్షలు చేయించి ఆ సంస్థ నుంచి తాత్కాలికంగా సరకులు తీసుకోవడం లేదు. ల్యాబ్ నివేదికలలోనూ ఇబ్బందులను గుర్తించాం. బియ్యం ఒకేలా లేకపోవడం వల్ల ప్రసాదాల తయారీ ఇబ్బందిగా మారింది. ఒకసారి మెత్తగా, మరోసారి గట్టిగా ఉంటోంది. కొన్నిసార్లు త్వరగా పాడవుతోంది. బియ్యంలోనూ మలినాలు, విరిగిపోవడాలు ఉంటున్నాయి. నెయ్యి కూడా ఆర్గానిక్ అంటూ ఇస్తున్నారు. ఇదీ నాణ్యంగా లేదని ప్రాథమికంగా పరీక్షిస్తే తేలింది. అందువల్ల సంస్థ సేవలను తాత్కాలికంగా సస్పెండ్ చేశాం. నాణ్యమైన సరకులు ఇస్తారన్న నమ్మకం తితిదేకు వస్తే పునరుద్ధరిస్తాం. ఇది డొనేషన్ పద్ధతిన పెట్టారు. వీటన్నింటిపై చర్చించి నిర్ణయం తీసుకుంటాం' అని ఈవో వెల్లడించారు.

**వివిధ రకాల కొవ్వులు కలిసినట్లు నిర్ధారణ అయింది**

ఎన్‌డీడీబీ కాఫ్ ల్యాబ్ 39 రకాల పరీక్షలతోపాటు నెయ్యి నాణ్యతకు ప్రామాణికమైన 'ఎస్-విలువ'కు ఐదు రకాల పరీక్షలు చేసింది. ఒక ఈక్వేషన్ ప్రకారం ఎస్-విలువ 98.05 నుంచి 101.95 మధ్య ఉండాల్సి ఉండగా.. తక్కువగా 87.61 ఉన్నట్టు పరీక్షల్లో నిర్ధారణ అయింది. అందులో సోయాబీన్, పొద్దుతిరుగుడు, ఆలివ్, ఆవాలు, అవిసెలు, చేపనూనె వంటివి ఉన్నట్లు తేలింది.

మరో ఈక్వేషన్ ప్రకారం ఎస్-విలువ 99.42 నుంచి 100.58 మధ్య ఉండాల్సి ఉండగా, అత్యధికంగా 106.90 ఉన్నట్లు పరీక్షల్లో నిర్ధారణ అయింది. ఇందులో కొబ్బరిపామ్, కెర్నెల్ కొవ్వు ఎక్కువగా ఉంది.

ఇలాంటివి పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై నిపుణుల కమిటీ వేశాం. వారి సలహాతోనే టెండర్లు పిలిచి నాణ్యమైన నెయ్యి కొంటున్నాం. నెయ్యి నాణ్యతను పరీక్షించే ల్యాబ్ ఇక్కడే ఏర్పాటు చేయడానికి రూ.75 లక్షల విలువైన పరికరాలను విరాళంగా ఇస్తామని ఎన్‌డీడీబీ ముందుకొచ్చింది. త్వరలో అవి విదేశాల నుంచి వస్తాయి. గతంలో నాణ్యత తక్కువగా ఉందంటూ నెయ్యి ట్యాంకర్లను తిరస్కరించి ఉండొచ్చు. కానీ జంతువుల కొవ్వులు కలిశాయా? అనే అంశంపై తొలిసారి పరీక్షలు చేశాం.

వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్, పరాగ్ మిల్క్ ఫుడ్స్, ఏఆర్ డెయిరీ ఫుడ్స్, కిర్పారామ్ డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్, ప్రీమియర్ ఆగ్రి ఫుడ్స్‌లు తితిదేకి నెయ్యి సరఫరా చేస్తున్నాయి. వీటిల్లో ఏఆర్ డెయిరీ ఫుడ్స్‌లో కల్తీ ఉన్నట్లు తేలింది.

నందిని ఏళ్లపాటు తితిదేకు నెయ్యి సరఫరా చేసింది. మిగిలిన వారు బాగా తక్కువ ధరకు కోట్ చేయటంతో అది వెనక్కి తగ్గింది. ప్రస్తుతం నందిని రూ.478కి నెయ్యిని ఇస్తోంది' అని ఈవో తెలిపారు.

# ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తా... వెనుకడుగు వేసే ప్రసక్తి లేదు

యువగళం పాదయాత్రలో భాగంగా ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తానని ఏపీ విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. యువగళం 100 కిమీ పూర్తయిన సందర్భంగా ఇచ్చిన తొలి హామీ మేరకు గ్రామ ప్రజల ఆనందోత్సాహాల నడుమ బంగారుపాళ్యంలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను మంత్రి లోకేశ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... రాబోయే 5 ఏళ్లలో చిత్తూరు జిల్లా సమగ్రాభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. యువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లా ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని జీవితంలో మరువలేనని పేర్కొన్నారు. గతేడాది జనవరి 27న కుప్పం శ్రీ వరదరాజస్వామి పాదాల చెంత నుంచి తాను ప్రారంభించిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిందని తెలిపారు.

11 ఉమ్మడి జిల్లాలు, 97 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 2,200 గ్రామాలను స్పృశిస్తూ 3132 కి.మీ.ల మేర యువగళం పాదయాత్ర సాగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో మరెవరూ చేయని విధంగా 14 అసెంబ్లీ నియోజకవర్గాలను కవర్ చేస్తూ 45 రోజుల పాటు 577 కి.మీ.ల మేర కొనసాగిన యువగళం పాదయాత్ర రికార్డు సృష్టించింది. యువగళాన్ని అడ్డుకునేందుకు ఆరోజున ఇదే బంగారుపాళ్యంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోని పోలీసులు ఎంత అరాచకం సృష్టించారో ప్రజలంతా కళ్లారా చూశారని తెలిపారు. తన పాదయాత్రను అడ్డుకునేందుకు జీఓ నెం.1ను సైతం విడుదల చేసి, ఇదే బంగారుపాళ్యంలో తన ప్రచారరథాన్ని నాటి పోలీసులు అడ్డుకున్న విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ గుర్తు చేశారు. కానీ, యువగళం అన్నది తన ఒక్కడి గొంతు కాదని, 5 కోట్లమంది ప్రజల గొంతుక అని వారికి తర్వాత అర్థమైందంటూ పేర్కొన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా యువగళాన్ని ఆపడం వారి తరం కాలేదన్నారు. ఇక పాదయాత్ర సమయంలో ప్రతి 100 కి.మీ.లకు ఒక అభివృద్ధి కార్యక్రమానికి మైలురాయి వేసి, అధికారంలోకి వచ్చాక నెరవేర్చాలని ఆనాడు నిర్ణయం తీసుకున్నానని మంత్రి తెలిపారు. అందులో భాగంగా యువగళం పాదయాత్ర 8వ రోజు (3-2-2023)న బంగారుపాళ్యంలో 100 కి.మీ.లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఇక్కడ తొలి మైలురాయిని ఆవిష్కరించినట్లు చెప్పారు. ఈ ప్రాంతంలో డయాలసిస్ కేంద్రం అవసరం ఉందని స్థానికులు చెప్పడంతో ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తానని ఆనాడు హామీ ఇచ్చానని తెలిపారు. అందుకే అన్నమాట ప్రకారం ఇప్పుడు ఇక్కడ ఈ సెంటర్ ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

బంగారుపాళ్యం ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారని, తరచూ డయాలసిస్ కోసం దూరప్రాంతాలకు వెళ్లడానికి డబ్బు, సమయం ఖర్చవుతున్నాయి. ప్రైవేట్ డయాలసిస్ సెంటర్లకు వెళ్లి వేలు వెచ్చించి డయాలసిస్ చేయించుకోవడం ఇక్కడి పేదలకు తలకుమించిన భారంగా మారిందని మంత్రి తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అందరి ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోపే ఈరోజున బంగారుపాళ్యంలో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నానని మంత్రి లోకేశ్ తెలిపారు. ఈ డయాలసిస్ కేంద్రం ఏర్పాటుతో కిడ్నీబాధితులు వ్యయప్రయాసల కోర్చి దూరప్రాంతాలకు వెళ్లే బాధ తప్పుతుందన్నారు. తమ ఊళ్లోనే ఉచితంగా డయాలసిస్ చేయించుకునే అవకాశం దొరుకుతుందని తెలిపారు. యువగళం సందర్భంగా కుటుంబ సభ్యుడి మాదిరిగా తనపై అభిమానాన్ని చూపి, ఈరోజు రాష్ట్రప్రజలకు సేవ చేసుకునే అవకాశమిచ్చిన ప్రజలందరికీ మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

# హైడ్రాకు సర్వాధికారాలు

- మొదటి పేజీ తరువాయి

మంత్రివర్గం కేటాయించింది.

**మెడికల్ కాలేజీలలో 3 వేల పోస్టులకు నోటిఫికేషన్**

ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఫైర్ స్టేషన్‌కు 34 మంది సిబ్బంది నియామకానికి క్యాబినెట్ అనుమతించింది. కొత్తగా ఏర్పాటైన మెడికల్ కాలేజీలలో 3 వేల పైచిలుకు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులకు అనుమతిచ్చింది. వాటి భర్తీకి త్వరలో నోటిఫికేషన్ జారీచేస్తారు. కోస్గిలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీ, హకీంపేటలో జూనియర్ కాలేజీ మంజూరుచేసింది. ప్రాంతీయ వలయ రహదారి(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగం ఎలైన్‌మెంట్ ఖరారుకు 12 మంది ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. దీనికి పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. పోలీసు ఆరోగ్య భద్రత పథకాన్ని స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌కు వర్తింపజేస్తారు. తదుపరి మంత్రివర్గ సమావేశం వచ్చే నెల మొదటివారంలో ఉంటుంది. అప్పుడు ఇందిరమ్మ ఇళ్లతో పాటు మిగిలిన అంశాలపై నిర్ణయాలు తీసుకుంటాం" అని పొంగులేటి చెప్పారు.

**2027 నాటికి ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి**

ప్రస్తుత ఖరీఫ్‌లో పండే సన్న ధాన్యం కొనుగోలుకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బోనస్‌కు అవసరమైన నిధుల మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు వివరించారు. "గత 20 ఏళ్లుగా నల్గొండ జిల్లాలో పెండింగులో ఉన్న ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తిచేయడానికి సవరించిన అంచనా వ్యయం ప్రకారం రూ.4,637 కోట్ల మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ టన్నెల్ పనులను శుక్రవారం పరిశీలించి నిర్మాణ సంస్థతో సుదీర్ఘంగా చర్చించిన తర్వాత మంత్రివర్గ సమావేశంలో ఆమోదించాం. డిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులపై నిర్ణయం తీసుకున్నాం. దీనికి పర్యావరణంతో పాటు ఇతర అనుమతులన్నీ వేగంగా తీసుకునేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని క్యాబినెట్ నిర్ణయించింది. కాళేశ్వరంపై రూ.లక్ష కోట్లు వ్యయం చేసినా లక్ష ఎకరాలకు నీరు రాలేదు. కానీ తాజాగా సవరించిన అంచనాలతో రూ.4,637 కోట్లు ఎస్ఎల్‌బీసీకి ఖర్చుపెడితే.. గ్రావిటీ ద్వారా 4 లక్షల ఎకరాలకు నీరు వస్తుంది. మరో 2, 3 నెలల్లో ఈ పనులు మొదలవుతాయి. నెలకు 400 మీటర్ల సొరంగం తవ్వకం పనులు చేయాలి. 2027 సెప్టెంబరు వరకూ పనులు పూర్తిచేయాలని నిర్మాణ సంస్థకు ఆదేశాలిచ్చాం. ఇది పూర్తయితే శ్రీశైలం రిజర్వాయర్ డెడ్ స్టోరేజీ స్థాయి నుంచి కూడా నీటిని తీసుకోవచ్చు. రోజుకు 4 వేల క్యూసెక్కులు, ఏడాదికి 30 టీఎంసీలతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. వచ్చే నెలలో కొత్త రేషన్‌కార్డులు ఇచ్చి.. జనవరి నుంచి కార్డులపై సన్న బియ్యం పంపిణీ చేస్తాం" అని చెప్పారు.

**ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం**

ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తిచేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలపడం నల్గొండ జిల్లా ప్రజలకు ఎంతో సంతోషకరమైన వార్త అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. దీంతో ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. "ఇది అవుతుందా... లేదా... అని కేసీఆర్ గతంలో అసెంబ్లీలో వ్యంగ్యంగా మాట్లాడారు. 2004లో కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టును చేర్చాం. తర్వాత నాటి సీఎం వైఎస్‌పై ఒత్తిడి తెచ్చి దానిని మంజూరు చేయించాం. కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందని గత పదేళ్లలో రూ.3 వేల కోట్లు ఖర్చుపెట్టకుండా అప్పటి సీఎం కేసీఆర్ దాన్ని పక్కన పడేశారు. సొరంగం తవ్వే పనులకు అవసరమైన సామగ్రి కోసం నేను అమెరికా వెళ్లి సంబంధిత కంపెనీ వారితో చర్చించాను. అక్కడ ఒక రోజు మొత్తం సమావేశం పెట్టుకున్నాం. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ మాయం చేశానని కేసీఆర్ చెప్పుకొన్నారు. కానీ నిజానికి గత పదేళ్లలో ఫ్లోరైడ్ ఇంకా పెరిగింది. కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం నల్గొండలో ఫ్లోరైడ్ 10 పీపీఎం ఉంది. మిషన్ భగీరథకు నల్గొండలో రూ.6 వేల కోట్లు ఖర్చుపెడితే.. అందులో రూ.4 వేల కోట్ల స్కాం జరిగింది. పనిచేసే ప్రభుత్వానికి.. మాటల ప్రభుత్వానికి మధ్య తేడా ఇది" అని అన్నారు.

# అంతా చంద్రబాబు కట్టు కథ..

- మొదటి పేజీ తరువాయి

లడ్డూ తయారీ సామగ్రి కొనుగోలు ప్రక్రియ జరుగుతోందని చెప్పారు. నెయ్యి నాణ్యత నిర్ధారణ పరీక్ష విధానాలను ఎవరూ మార్చలేదని, ఇంత దుర్మార్గమైన పని ఎవరైనా చేయగలరా అని అన్నారు. ఒక సీఎం ఇలా అబద్ధాలు ఆడటం ధర్మామేనా అని జగన్ మండిపడ్డారు. జులై 17న ఎన్‌డీడీబీకి నెయ్యి శాంపిల్స్ పంపించారని, జులై 23న రిజెక్ట్ చేస్తే చంద్రబాబు ఇప్పటివరకు ఏం చేశారు?. ఎందుకు బయటకు చెప్పలేదని ప్రశ్నించారు. జరగనిది జరిగినట్టు చంద్రబాబు చెబుతున్నారని జగన్ పేర్కొన్నారు. నెయ్యి తీసుకొచ్చే ప్రతి ట్యాంకర్ సర్టిఫికెట్ తీసుకోవాలని, ప్రతి ట్యాంక్ శాంపిళ్లను మూడుసార్లు టెస్ట్ చేస్తారని వివరించారు.అబద్ధాలను ప్రచారం చేయడం ద్వారా తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్నారని వైఎస్ జగన్ అన్నారు. మన తిరుమలను మనమే తక్కువ చేసుకుంటు న్నామని అన్నారు. లడ్డూ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీకి, సుప్రీంకోర్ట్ ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాస్తానని అన్నారు. 100 రోజుల పాలనపై ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ వ్యవహారం అని అన్నారు.

**కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనపై మండిపాటు**

మరోవైపు సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనపై జగన్ విమర్శలు గుప్పించారు. చంద్రబాబు వంద రోజుల పాలన అంతా మోసమేనని వ్యాఖ్యానించారు. "సూపర్ సిక్స్ లేదు... సెవెనూ లేదు. వ్యవస్థలన్నీ తిరోగమనంలో ఉన్నాయి. గోరు ముద్ద గాలికి ఎగిరిపోయింది. ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటివరకు వసతి దీవెన, విద్యా దీవెన కూడా ఇవ్వలేదు. 108, 104 ఉద్యోగులకు ఇప్పటివరకు జీతాలు ఇవ్వలేదు. డైవర్షన్ పాలిటిక్స్‌లో చంద్రబాబు దిట్ట. వరదలు వస్తాయని అప్రమత్తత ఉన్నా రివ్యూ చేయలేదు" అని జగన్ ఆరోపించారు.

# జానీ నాలుగేళ్లుగా లైంగిక దాడి చేశాడు.. అతనే చెప్పాడు

అసిస్టెంట్ మహిళా కొరియోగ్రాఫర్‌పై లైంగిక వేధింపుల కేసులో ప్రముఖ కొరియోగ్రాఫర్, జనసేన నేత జానీ అలియాస్ జానీ భాషా అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఉప్పరపల్లి కోర్టు జానీకి 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధించడంతో పోలీసులు అతడిని చంచల్ గూడ్ జైలుకు తరలించారు. అయితే, కొరియాగ్రాఫర్ జానీ రిమాండ్ రిపోర్ట్‌లో పోలీసులు సంచలన విషయాలు వెల్లడించారు. తమ విచారణలో జానీ నేరాన్నీ అంగీకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. దురుద్దేశంతోనే జానీ ఆమెను అసిస్టెంట్‌గా చేర్చుకున్నాడన్న పోలీసులు.. నాలుగేళ్లుగా బాధితురాలిపై పలుమార్లు లైంగిక దాడి చేసినట్లు వెల్లడించారు. 2020లో ముంబైలోని ఓ హొటల్ లో కూడా జానీ లైంగిక దాడికి పాల్పడినట్లు.. ఈ విషయాన్ని విచారణలో జానీనే ఒప్పుకున్నట్లు తెలిపారు. లైంగిక దాడి జరిగినప్పుడు బాధితురాలి వయసు 16 ఏళ్లని వెల్లడించిన పోలీసులు.. జానీ భార్య కూడా బాధితురాలిని బెదిరించిందని జానీ రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే తనపై నమోదైన కేసుపై స్పందించిన జానీ.. ఇది అక్రమ కేసు అని.. తనను కావాలని టార్గెట్ చేశారని అన్నారు. తనను ఇరికించేందుకు కొందరు కుట్ర చేస్తున్నారన్న జానీ.. లీగల్‌గా ఫైట్ చేస్తానని స్పష్టం చేశారు. తనను టార్గెట్ చేసిన ఎవరిని వదలనని.. వడ్డీతో సహా చెల్లిస్తానని జానీ హెచ్చరించారు. జానీ వెర్షన్ ఇలా ఉంటే.. పోలీసులు మాత్రం రిమాండ్ రిపోర్టులో జానీ నేరం అంగీకరించాడని పేర్కొనడం సంచలనంగా మారింది. దీంతో కొరియోగ్రాఫర్ జానీ కేసుపై ఉత్కంఠ నెలకొంది.

# రూ.93 వేల కోట్ల ప్రాజెక్టులో రూ.1 లక్ష కోట్ల అవినీతి ఎలా జరిగింది?

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లక్ష కోట్ల రూపాయల అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ మ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.93 వేల కోట్లు ఖర్చు అయితే లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందో చెప్పాలన్నారు.శుక్రవారం ఆయన మల్లన్న సాగర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాళేశ్వరం కొట్టుకుపోయిందని కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెట్టారని, ఈ ప్రాజెక్టు నిజంగానే కొట్టుకుపోతే మల్లన్న సాగర్ నిండు కుండలా ఎలా ఉందో చెప్పాలన్నారు. తమ పార్టీది వాటర్ డైవర్ట్ పాలిటిక్స్ అయితే కాంగ్రెస్ పార్టీది మాత్రం అటెన్షన్ డైవర్ట్ పాలిటిక్స్ అని చురక అంటించారు.

# దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై తెలంగాణ హైకోర్టులో విచారణ

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై శుక్రవారం తెలంగాణ హైకోర్టులో సీజే ధర్మాసనం విచారణను చేపట్టింది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ 160 ఎకరాలుగా పేర్కొనడంపై ప్రియతమ్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత రికార్డుల ప్రకారం ఎఫ్‌టీఎల్ పరిధి 65 ఎకరాలుగా ఉందని పిటిషన్‌లో పేర్కొన్నారు. అనంతరం విచారణను సోమవారానికి వాయిదా వేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని రెవెన్యూ, నీటి పారుదల శాఖ, హెచ్‌ఎండీఏకు నోటీసులు జారీ చేసింది.హైదరాబాద్ నగర పరిధిలోని వివిధ చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఇప్పటికే పలు అక్రమ నిర్మాణాలను కూల్చి వేసింది. ఈ క్రమంలో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిపై శుక్రవారం సీజే ధర్మాసనం విచారణ చేపట్టింది.

# తిరుమల లడ్డూపై వివాదం.. బాధ్యులపై కఠిన చర్యలు:

- మొదటి పేజీ తరువాయి

సనాతన ధర్మానికి ఏ రూపంలో ముప్పు వచ్చినా మనమంతా కలిసికట్టుగా నిర్మూలించాలని పేర్కొన్నారు.

**తిరుమల నెయ్యిలో జంతుకొవ్వు**

జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో తితిదే మహాప్రసాదమైన లడ్డూల తయారీలో వినియోగించిన నెయ్యిలో పంది కొవ్వు, గొడ్డు కొవ్వు, చేప నూనె వంటివి కలగలసి ఉండొచ్చనే అనుమానాన్ని గుజరాత్‌కు చెందిన నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) కాఫ్ లిమిటెడ్ సంస్థ వ్యక్తం చేసినట్లు తెదేపా తెలిపింది. ఈ నెయ్యిలో పెద్ద ఎత్తున కల్తీ జరిగిందని, అందులో పాలకు సంబంధించినవి కాకుండా ఇతరత్రా కొవ్వులు (ఫారిన్ ఫ్యాట్స్) కలగలిసి ఉన్నట్లు ఆ పరీక్షల్లో వెల్లడైందని వివరించింది. దీనిపై పెద్ద ఎత్తున దుమారం రేగుతోంది. ఈ విషయంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# శిథిలమైన చేతిపంపులకు మరమ్మత్తులు చేపట్టాలి





**సీకే న్యూస్ వేములపల్లి సెప్టెంబర్ 20 :**మండలంలో శిథిలమైన చేతిపంపులకు మరమ్మతులు నిర్వహించి త్రాగునీటి అవసరాలకు నీరు అందించాలని మాజీ వైస్ ఎంపీపీ పాదూరు గోవర్ధన శశిధర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పనిచేయని చేతిపంపులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో సుమారు 290 కి పైగా చేతిపంపులు ఉన్నాయని, వాటిలో సుమారు 100 చేతిపంపులు మాత్రమే పనిచేస్తున్నా యన్నారు. చేతిపంపులు అందుబాటులో లేకపోవడం వల్ల గ్రామాల్లో త్రాగునీరు, గృహ అవసరాలకు నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో చేతిపంపులు అందుబాటులో ఉండటం వల్ల విద్యుత్ సరఫరా లేకున్న ఎల్లవేళలా నీరు అందేదన్నారు. ప్రస్తుతం మిషన్ భగీరథ నీటి సరఫరా వస్తుందన్న నేపంతో చేతిపంపులను మరమ్మత్తులు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారన్నారు. మిషన్ భగీరథ, విద్యుత్ మోటార్ల ద్వారా వచ్చే నీటిపై ఆధారపడినట్లయితే నీటి సమస్య నెలకుంటుందన్నారు. వెంటనే ప్రభుత్వం మండల పరిషత్ ద్వారా చేతిపంపుల మరమ్మత్తులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. మండలంలోని చేతిపంపుల నిర్వహణకు, మరమ్మత్తులకు గతంలో ఉన్న సిబ్బందిని తిరిగి కొనసాగించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన మండలంలోని అన్ని గ్రామాల్లో శిథిలమైన చేతిపంపులను పునరుద్ధరించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రయాణిస్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు



**సీకే న్యూస్ మాడుగులపల్లి సెప్టెంబర్ 20:**నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కొత్తగూడెం వద్ద అద్దంకి- నార్కెట్ పల్లి రాష్ట్రీయ రహదారిపై అగ్ని ప్రమాదం చోటుబచేసుకుంది. రహదారిపై ప్రయాణిస్తున్న కార్ ఇంజన్లో ఒక్కసారిగా మంటలు చెరరేగాయి.చూస్తుండగానే మంటలు కారు మొత్తం వ్యాపించాయి.మంటలు గమనించి కారులో ఉన్న ప్రయాణికుడుని స్థానికులు అద్దాలు పగల కొట్టి బయటికి తీశారు.గాయాలతో ఆకస్మానిక స్థితిలో ఉన్న ప్రయాణికున్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నల్గొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు.త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా దగ్ధమైంది.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గణేషుని మండపం వద్ద అన్నప్రసాద వితరణ





**సి కే న్యూస్ (సంపత్) సెప్టెంబర్ 20:**ఆలేరు మండలం మంతపురి గ్రామంలోని 2వ వీధి లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేషుని మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రము నిర్వహించారు.గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఆ స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించడం జరిగింది..ఈ కార్యక్రమంలో 2వ వీధి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు బండారి ప్రసాద్ ముదిరాజ్,పేరపు స్వామి,సిద్దులు,శివ,కోరుటూరి సిద్దులు,భిక్షపతి,చందు,సమ్మేశ్వర్,ప్రశాంత్,శ్రీకాంత్,ఉదయ్,పల్లె ఉదయ్,గుమ్మడి శ్రీను,సాయి,విజయ్,కర్రే రాజు,మక్కల పరశురాములు మరియు వాడ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# రోషమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్ దంపతులు..

**ఖమ్మం /తల్లాడ/ సెప్టెంబర్/ 20 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్ :** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం సొసైటీ డైరెక్టర్ గోవిందు శ్రీనివాసరావు మాతృమూర్తి రోషమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ దంపతులు హాజరై ఆమె మృతదేహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాప సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో కల్లూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ భాగం నీరజ, అన్నారు గూడెం మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత, మాజీ ఎంపీటీసీ తాళ్ల జోసెఫ్, నాయకులు మారెళ్ళ లక్ష్మణరావు, దుండేటి వీరారెడ్డి, కొమ్మినేని వెంకటేశ్వరరావు కేవీ, మారెళ్ల మల్లిఖార్జున్ రావు, దగ్గుల రఘుపతి రెడ్డి, తుమ్మలపల్లి రమేష్, రాయల రాము, దీవెల కృష్ణయ్య, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



# కార్మికుల హక్కుల కోసం పోరాడటమే సీతారాం ఏచూరి కి ఇచ్చే నిజమైన నివాళి




- సిఐటియు పట్టణ కన్వీనర్ ఎం బి నర్సారెడ్డి.
- సిఐటియు ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),సెప్టెంబర్ 20,**మోడీ తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ కార్మిక హక్కులను కాపాడుకోవడమే సీతారాం ఏచూరి కి ఇచ్చే నిజమైన నివాళి అని సిఐటియు భద్రాచలం పట్టణ కన్వీనర్ నర్సారెడ్డి పిలుపునిచ్చారు. శు క్రవారం స్థానిక సిఐటియు కార్యాలయము నందు ఎన్ నాగరాజు అధ్యక్షతన జరిగిన కా. సీతారాం ఏచూరి సంతాప సభ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎంబీ నర్సారెడ్డి సీతారాంఏచూరి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించి న అనంతరం మాట్లాడుతూ అనారోగ్యంతో మరణించిన సీతారాం ఏ చూరి అకాల మరణం చెందటం దేశంలోని కార్మిక వర్గానికి మొత్తానికి తీవ్ర నష్టమని ఒక వైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలన్నిటిని రద్దుచేసి కార్మిక కోడ్లుగా మార్చిందని వీటి పై అలుపెరుగని పోరాటం చేస్తున్నటువంటి సీతారాం ఏచూరి పోవటం కార్మిక వర్గానికి తీవ్ర లోటు అని అన్నారు ఎన్నో ఏళు పోరాటాలు చేసి సాధించుకున్నటువంటి కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక కోళ్లుగా మార్చటాన్ని వ్యతిరేకిస్తూ ఈ కార్మిక కోడ్లు రద్దు అయినప్పుడే సీతారాం ఏచూరికి ఇచ్చే నిజమైన నివ్వాలి అని అన్నారు కావున రాబోయే కాలంలో అన్ని సంఘాల, రంగాల, కార్మికులు సీతారాం ఏచూరి సంతాప సభలను అన్ని కార్మిక వాడల్లో నిర్వహించి గణమైన నివాళు లర్పించాలని ఈ సందర్భంగా కోరినారు ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ నాయకులు గడ్డం స్వామి, పారెల్లి సంతోష్, అప్పారి రాము, అజయ్ కుమార్ ,రాయల రాములు, పండ్ల వర్తక సంఘం నాయకులు రాము,బాలకృష్ణ, వాసు, బాలాజీ, మురళి కృష్ణ, భూపేందర్, రవి, తదితరులు పాల్గొన్నారు

# మిస్టరీ సాధించిన చేగుంట పోలీసులు






**సెప్టెంబర్ 21 ( సీకే )చేగుంట :**మెదక్ జిల్లా చేగుంట శనివారం తేదీ 14. 09.2024 నాడు ఫిర్యాదురాలు అయిన జరుపుల దేవి భర్త: శీను గ్రామం ఉసిరిక పల్లి శివంపిట మండల్ మెదక్ జిల్లా గారి ఫిర్యాదు మేరకు ఫిర్యాదురాలి తల్లి అయిన మాలోతు లలిత భర్త రామ్ సింగ్ వయస్సు:48 సంవత్సరాలు, కులం:ఎస్టి లంబాడి వృత్తిఃవ్యవసాయము గ్రామం సాజులాండ చెట్ల తిమ్మాయిపల్లి అదృశ్యమైనట్లు దరఖాస్తు ఇవ్వగా సేరం సెంబర్ 298/2024 ఎందు మిస్సింగ్ కేసు నమోదు చేసినాము.మృతురాలు తేదీ 11.09.2024 నాడు ఉదయం 11 గంటలకు మాసాయిపేటకు బ్యాంకు నుండి డబ్బులు తీసుకోవడానికి వెళ్తున్నానని ఇంటి నుండి బయలుదేరినది కానీ తేదీ 14.09.2024 వరకు ఇంటికి రానందున ఫిర్యాదు చేసినారు. సేరస్తులైన వల్లపు కనకయ్యుఏ వడ్డే కనకయ్య ,వల్లెపు ప్రమీల ఏ వడ్డే ప్రమీల నివాసం : గ్రా. ఘన్పూర్,మం.తూప్రాన్ లు మృతురాలికి తూప్రాన్ లోని కళ్ళు దుకాణంలో పరిచయమై మృతురాలు శరీరంపై గల బంగారు వెండి వస్తువులను కాచేయాలని ఉద్దేశంతో మృతురాలితో పరిచయం చేసుకుని రెండు మూడు సార్లు కళ్ళు దుకాణంలో మృతురాలతో కలిసి కళ్ళు తాగి అమె యొక్క ఫోన్ నెంబర్ తీసుకుని ఒక పథకం ప్రకారం తేదీ తేదీ 11.09.2024 నాడు ఉదయం సేరస్తులు మృతురాలికి ఫోన్ చేసి యాదగిరిగుట్ట తీసుకెళ్తామని చెప్పే నగలు వేసుకొని గుడికి రావాలని మృతురాలికి తెలుపగా, మృతురాలు తూప్రాన్ కి రాగా సేరస్తులు వారి యొక్క ఫ్యాషన్ ప్రో బైక్ నెంబర్ %ట%53586428 మృతురాలని ఎక్కించుకొని తూప్రాన్ నుండి యాదగిరిగుట్ట వెళ్ళు మార్గమధ్యలో జగదేవ్పూర్ దాటిన తర్వాత పీర్లపల్లి అడవి ప్రాంతానికి మృతురాలుని తీసుకెళ్లి
గొంతు నులిమి చంపివేసి ఆమె శరీరంపై గల వెండి కడియాలు, వెండి మట్టెలు మరియు బంగారు చెవి కమ్మలు మరియు మృతురాలి సెల్ఫోన్ లను దొంగలించుకొని మరల తిరిగి వారి యొక్క బైక్ పై ఇంటికి వచ్చినారు తదుపరి
అట్టి వెండి కడియాలు వెండి మెట్టెలు బంగారు చెవి కమ్మలు తూప్రాన్ లోని పాన్ బ్రోకర్స్ వద్ద కుదువ ఎటట్టి, ఒక స్లిండర్ ప్లస్ బైక్ కొనుక్కున్నారు. పైన తెల్పిన బంగారు మరియు వెండి ఆభరణాలు స్వాదీనం చేసుకోవడం
జరిగింది అట్టి బంగారు మరియు వెండి యొక్క విలువ సుమారు రూ.33,000/- లు. ఈ కేసు ను చేదించడంలో దాక చక్యంగా వ్యవహరించిన సి .ఐ వెంకట రాజాగౌడ్, చేగుంట యస్.ఐ చైతన్య కుమార్ రెడ్డి, యచ్.సి సత్తయ్య పి.సి లు భాస్కర్, గట్టిప్, రమేశ, మహిశ్ మరియు హెూం గార్డు అర్హద్ లను. తూప్రాన్ డి.యస్.పి, యస్. వెంకట్ రెడ్డి.. విరిని అభినందించారు

# బహుజన రక్షణ సమితి బి ఆర్ ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షులుగా కరకాల రమేష్...



**సి కే న్యూస్ ((సంపత్) సెప్టెంబర్ 20:**బహుజన రక్షణ సమితి బి ఆర్ ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షులుగా భువనగిరికి చెందిన కరకాల రమేష్ ని నియమించడం జరిగింది..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అంబేద్కర్ పూలేల ఆలోచనా వారి ఆశయాల కోసం మరింత ఉత్సాహంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని,,ఎస్సీ ఎస్టీ బి సి మైనార్టీల ఐక్యత బహుజన బలగాన్ని ఏకం చేసి పేద ప్రజల హక్కులను కాల రాస్తున్న పెత్తందారుల అరాచకాలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైంది..బహుజనులకు రాజ్యాధికారం దక్కేంత వరకు బహుజన రక్షణ సమితి ఆధ్వర్యంలో ఉద్యమిస్తూనే ఉంటాం.నన్ను జిల్లా అధ్యక్షులుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు పాకాల దానియేలు అన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కృతజ్ఞతతో మహానీయుల అడుగు జాడల్లో వారి ఆశయాల కోసం చిత్తశుద్ధితో బహుజనుల హక్కులను కాపాడతానని తెలిపారు..

# భద్రాచలంలో 45 కేజీల ఎండు గంజాయి పట్టివేత.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, (సాయి కౌశిక్),సెప్టెంబర్ 20,**ఖమ్మం డిసి జనార్ధన్ రెడ్డి ఏసి గణేష్ ఆదేశాల మేరకు భద్రాచలం కూనవరం రోడ్డులోని ఆర్టిఏ చెక్ పోస్ట్ వద్ద ఖమ్మం ఎన్ఫోర్స్మెంట్ బృందం వాహన తనిఖీ చేస్తూ ఉండంగా ఒరిస్సా నుంచి రాజస్థాన్ కి కారులో ముఖేష్ మిర్ద, గుజ్జర్ శ్రీరామ అను వ్యక్తులు 45.170 కేజి ల ఎండు గంజాయిని తరలిస్తుండగా పట్టుబడ్డారు. రెండు సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల లో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సి.హెచ్ శ్రీనివాస్ మరియు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ బాలు, కానిస్టేబుల్స్ సుధీర్, హరీష్, హనుమంతరావు, వెంకట్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# చేగుంట మండల : ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం.





**సెప్టెంబర్ 21 (సీ కే ) చేగుంట :**మెదక్ జిల్లా చేగుంట ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎన్నికైనటువంటి వారిని ఘనంగా సన్మానించిన ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎంఈఓ బుచ్చా నాయక్, ఎంపీడీవో చిన్నారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో ప్రాముఖ్యమైనదని, దేశ భవిష్యత్తు తరగతి గదులలో నిర్మింపబడుతుందని అన్నారు. మండల విద్యాధికారి బుచ్చా నాయక్ మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని, ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదట ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి అంచలంచలుగా ఎదిగి రాష్ట్రపతిగా అయి ఆ వృత్తికి వన్నెతెచ్చిన మహానుభావుడు అని అన్నారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులు ఎన్నికైన ఉపాధ్యాయులు బి.అమర శేఖర్ రెడ్డి పి జి హెచ్ ఎం, ఏ.శ్రీనివాసరావు పీజీహెచ్ఎం,కే. దేవయ్య, , జి.గిరిధర్, టి. కిషన్, జి.దామోదర్, ఎన్.సునీత హెలెన్, ఎస్. శ్రీనివాస్, జి. రాధ,వై. సుధాకర్ రెడ్డి , పి. వేణు, కే. నిర్మల, బి.రాజశేఖర్ రెడ్డి, టి.అమరేశ్వరి, జి. రేవతి, వి. స్వరూప రాణి, ఎం. శ్రీనివాస్, ఎం.వెంకటేష్, టీ. కవిత,ఈ కార్యక్రమంలో, మండల నోడల్ ఆఫీసర్ నీరజ, అమర్ శేఖర్ రెడ్డి, శ్రీనివాసరావు, లీలావతి,శ్రీ కిషన్, ఉపాధ్యాయుల సంఘాల నాయకులు గజ గట్ల నాగరాజు, గర్దాసు మనోహర్ రావు, బాల పోచయ్య, రావుల వెంకటేష్, రాజశేఖర్, చల్ల రామకృష్ణ, కొంతాలపల్లి పెంటా గౌడ్, , ఉపాధ్యాయులు,పాండు, వెంకట్రాంరెడ్డి, విట్టల్ రెడ్డి, వారాల నరసింహులు, చల్ల లక్ష్మణ్, సురేందర్, సలీం,శంకర్, రమా, రమాదేవి, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి విద్యా శిక్షణలు మహిళల స్వావలంబనకు సోపానాలు.

**–సేవా సమితి అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్.**




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),సెప్టెంబర్ 20,**
పివి కాలనీ నందు సింగరేణి యాజమాన్యం నూతనంగా నిర్మించిన సింగరేణి సేవ సమితి భవన్ నందు సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం మరియు జ్యూట్ బ్యాగ్ కోర్సులను శుక్రవారం ఉచిత శిక్షణ తరగతులను మణుగూరు ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్ మరియు డిజిఎం (పర్సనల్) మరియు అధికార ప్రతినిధి ఎస్ రమేశ్ చే ప్రారంభించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మణుగూరు ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్ మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ... మన సింగరేణిలో ఉన్నటువంటి ఉద్యోగులందరి సంక్షేమంతో పాటు సింగరేణి ఉద్యోగ కుటుంబాల మహిళలకు, స్థానిక, పరిసర ప్రభావిత ప్రాంత నిరుద్యోగ యువతి యువకులకు వివిధ వృత్తి విద్యా శిక్షణ కోర్సులకు ఉచిత శిక్షణ కల్పించటం జరుగుతుంది. అలాగే 2002 సంవత్సరం నుండి మన మణుగూరు ఏరియాలో సింగరేణి కుటుంబాలకు చెందిన మహిళలతో పాటు స్థానిక మరియు పరిసర గ్రామాల మహిళలకు కూడా అనేక రకాల వృత్తి విద్యా శిక్షణలు ఇవ్వడం ద్వారా ఎందరో మహిళలు నేడు ఇంటి వద్దనే ఉంటూ స్వయం ఉపాధి పొందుతున్నారు. వృత్తి విద్యా శిక్షణలు మహిళల స్వావలంబనకు సోపానాలు కాబట్టి మహిళలు తాము నేర్చుకున్న కోర్సులకు సంబందించిన యూనిట్లను ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగడం తో పాటు సాటి మహిళలకు జీవనోపాధి కల్పించే స్థాయికి ఎదగాలి. ఈ వృతి విద్యా శిక్షణల ద్వారా శిక్షణ పొందిన మహిళలకు హైదరాబాద్ ఖాదీ గ్రామోద్యోగ్ మహా విద్యాలయ్ వారు సర్టిఫికెట్లు కూడా అందజేయ బడుతుంది కాబట్టి ఈ శిక్షణల పట్ల ఆసక్తి గల మహిళలు సింగరేణి కల్పిస్తున్న అవకాశాల ను సద్వినియోగం చేసుకుని స్వావలంబన సాధించడం ద్వారా సమాజంలో మరింత గౌరవంగా జీవించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో భాగంగా విప్పల సింగారం, పైలట్ కాలనీ, పివి కాలనీ మరియు స్థానిక మహిళలు, యువతుల కొరకు నూతనంగా టైలరింగ్, బ్యూటీ షియన్, మగ్గం వర్క్ కొర్సులు ఏరియా సేవ అధ్యక్షురాలు దుర్గం సుమతి రామచందర్ చేతుల మీదుగా ప్రారంభించబడినవి. ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) ఎస్ రమేశ్, ఇల్లందు లేడీస్ క్లబ్ సెక్రటరీ కవిత శ్రీనివాస చారి, ఇతర యెల్లందు లేడీస్ క్లబ్ సభ్యులు, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్ , సేవ సెక్రటరీ షాకీరా, సేవా సభ్యులు, పెద్ద సంఖ్యలో శిక్షణ పొందుతున్న మహిళలు, తదితరులు పాల్గోన్నారు.

## ఎస్ జి ఎఫ్ మండల స్థాయి క్రీడాపోటీల బహుమతులు

**కబడ్డీ లో 1 విన్నర్ మక్కరాజ్ పేట**



**సెప్టెంబర్ 21 (సీ కే ) చేగుంట :**మెదక్ జిల్లా చేగుంట మండల్ మండల స్థాయిలో ఎస్ జి ఎఫ్ మండల స్థాయి క్రీడ పోటీలు నిర్వహించారు అందులో భాగంగా మక్క రాజుపేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. ప్రో కబడ్డీ లో. ఫస్ట్ ప్లేస్ లో. బహుమతులు గెలుపొందారు మాక్కరాజ్ పేట పి టి మేడం మంజులత మాట్లడుతూ మక్క రాజుపేట పాఠశాలకు ఫస్ట్ ప్రైజ్ రావడం లేదు సంతోషంగా ఉంది కాబట్టి మరెన్నో పథకాలు నాయక స్కూల్ కి వచ్చేలా కృషిచేసి మెదక్ జిల్లాలో మరియు రాష్ట్ర స్థాయిలో మరెన్నో పథకాలు కృషి పట్టుదలకు సాధిస్తామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మొక్క రాజుపేట. హెచ్ ఎం అమర్ శేఖర్ రెడ్డి
పి డి మేడం. చౌడం. మంజులత విద్యార్థులు సంపత్ చరణ్ సంజయ్ యశ్వంత్ యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు

## 68వ మండల స్థాయి ఎస్ జి ఎఫ్ పాఠశాలల క్రీడోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహణ .

**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు సెప్టెంబర్ 20.** వలిగొండ మండల కేంద్రంలో శ్రీ వెంకటేశ్వర ఉన్నత పాఠశాల ఆవరణలో కబడ్డీ ,కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడోత్సవాలలో 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు ,ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా. ప్రధానోపాధ్యాయులు ఎస్. భాస్కర్ గారు ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్సై యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించాలని గెలవాలంటే నిరంతరం సాధన చేయాలని సూచించారు, ఈ కార్యక్రమంలో సెక్రటరీ శ్రీనివాస్ , యువజన సంఘాల అధ్యక్షులు కొండూరి బాలరాజు , కాటేపల్లి ఉపేందర్, బచ్చు శ్రీనివాస్ ,బత్తిని సైదులు, వ్యాయామ ఉపాధ్యాయులు జి. స్వామిరాజు, జి.



చండీ ప్రసాద్, ఏ మల్లేశం ,సంధ్యారాణి, రాంప్రసాద్, జయరాని, మాధవి, ఉపాధ్యాయులు, జిలానీ, శివాజి, స్వామి, లింగయ్య, తదితరులు పాల్గొనడం జరిగింది.

## రక్తహీనత పై అవగాహన కార్యక్రమం .



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు సెప్టెంబరు 20.**యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని రామన్నపేట ప్రాజెక్టు పరిధిలోని వలిగొండ మండలంలో ప్రొద్దుటూరు గ్రామంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మెడికల్ ఆఫీసర్ జ్యోతి మేడం పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ పారిజాత మాట్లాడుతూ ఐరన్ యొక్క ప్రాముఖ్యత దానివల్ల కలిగి ప్రయోజనాలు వివరించినారు. ఐరన్ కలిగినటువంటి పల్లి పట్టీలు బెల్లము అటుకులు మురమురాలు యూస్ చేయాలని సూచించడం జరిగింది.
ఆరు నెలలు నిండిన వెంటనే కచ్చితంగా అన్నప్రాసన చేయాలని బలవర్ధకమైనటువంటి ఆహారము బాలామృతము తినిపించాలని పిల్లలు ఎవరు కూడా సమ్మమ్ లో పడకుండా చూసుకోవాలని మంచి ఆహారము పోషక విలువలు ఉన్నటువంటి ఆహారము పిల్లలకు అందించాలని సూచించడం జరిగింది.
ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ జ్యోతి మేడం పిహెచ్ఎన్ఓ సుకన్య రెడ్డి మేడం, ఎం ఎల్ హెచ్ పి కృష్ణవేణి,అంగన్వాడీ టీచర్స్ సునీత, రేణుక, ఏఎన్ఎం,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి ఘనంగా పంచామృతాభిషేకము.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి,( సాయి కౌశిక్ ),సెప్టెంబర్ 20,**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, కేశవాపురం- జగన్నాథపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) నందు శుక్రవారం ను పురస్కరించుకొని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీ కుమారీ ఆదేశముల మేరకు అమ్మ వారికి పంచామృతముల తో వైభవముగా అభిషేకము నిర్వహించబడినది. ముందుగా మేళతాళాలతో దేవస్థాన అర్చకులు, భక్తులు జన్మస్థలం వద్ద ఉన్న అమ్మవారికి పంచామృతాలు, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించి అనంతరం దేవాలయంలోని అమ్మవారి మూలవిరాట్కు పంచామృతాలతో అభిషేకం అనంతరం పంచ హారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా భక్తులు పూజలలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించినారు. ఇట్టి కార్యక్రమంలో భక్తులు, అర్చకులు, సిబ్బంది, పాల్గొన్నారు

## అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు..

**తల్లాడ ఎస్సై కొండల్ రావు..**

**తల్లాడ సెప్టెంబర్ 20 సీకే న్యూస్ ప్రతినిధి విజయ్:**
తల్లాడ మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తల్లాడ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ బీ. కొండలరావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని గొల్లగూడెం కట్టలేరు వాగునుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం తన దృష్టికి వచ్చిందన్నారు. ట్రాక్టర్ల యజమానులను పిలిపించి హెచ్చరించడం జరిగిందని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఊరుకోనన్నారు. ఎవరికైనా ఇసుక కావాల్సి వస్తే సంబంధిత అధికారులు అనుమతి తీసుకొని వెళ్లాలని సూచించారు.
అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే తన దృష్టికి తీసుకురావాలన్నారు.
శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు.



## ఉత్సాహంగా ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు.



**విజేతలకు శుభాకాంక్షలు తెలిపిన హెచ్ఎం, కన్వీనర్ రవిలాదేవి....**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),సెప్టెంబర్ 20,** బూర్గంపహాడ్ మండల స్థాయి క్రీడా పోటీలు ఈ నెల 19, 20 తేదిలు అనగా గురు, శుక్ర రెండు వారాలు విజయవంతంగా జరిగి ముగిశాయి. బూర్గంపహాడ్ మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీల్లో విజేతల యొక్క వివరాలను విడుదల చేసిన వివరాలు ఇలా ఉన్నాయి. సీనియర్ కబడ్డీ విభాగంలో మొదటి బహుమతి ఎంజెపిటిబిసి భద్రాచలం కాగా ద్వితీయ బహుమతి ప్రగతి స్కూల్ సారపాక కైవసం చేసుకుంది. అదేవిధంగా సీనియర్ ఖోఖో విభాగంలో మొదటి బహుమతి ఎంజెపిటిబిసి భద్రాచలం కాగ రెండవ బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నకిరిపేట కైవసం చేసుకుంది. సీనియర్ వాలీబాల్ విభాగంలో మొదటి బహుమతి ఏహెచ్ఎస్ ఉప్పసాక కాగ రెండవ బహుమతి జడ్పిహెచ్ఎస్ మొరంపల్లి బంజర కైవసం చేసుకుంది. అదేవిధంగా జూనియర్ విభాగంలో కబడ్డీ క్రీడలో మొదటి బహుమతి జిహెచ్ఎస్ బూర్గంపహాడ్ కాగ రెండో బహుమతి జడ్పిహెచ్ఎస్ సారపాక కైవసం చేసుకుంది. ఖోఖో క్రీడలో మొదటి బహుమతి జెడ్పిహెచ్ఎస్ నకిరిపేట కాగ రెండవ బహుమతి ఎంజెపిటిబిసి భద్రాచలం కైవసం చేసుకుంది. వాలీబాల్ క్రీడలో మొదటి బహుమతి ఏహెచ్ఎస్ ఉప్పసాక కాగ రెండవ బహుమతి జడ్పిహెచ్ఎస్ మొరంపల్లి బంజర కైవసం చేసుకుంది. అదేవిధంగా అథ్లెటిక్స్ క్రీడల యందు 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, షాట్ పుట్ అంశాల్లో ఎంజెబిటిబిసి భద్రాచలం, ఏహెచ్ఎస్ ఉప్పసాక, ప్రగతి స్కూల్, జడ్పిహెచ్ఎస్ నకిరేపేట, జిహెచ్ఎస్ బూర్గంపహాడ్ క్రీడాకారులు తమ ప్రతిభను చూపారని, మండల స్థాయి క్రీడలు ఇంత దిగ్విజయంగా నిర్వహించడంలో సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులకు, విజేతలైన క్రీడా కారులకు ధన్యవాదములు అభినందనలు తెలియజేసినట్లు బూర్గంపహాడ్ మండల స్థాయి క్రీడలకు కన్వీనర్ రవిలాదేవి తెలియజేశారు. క్రీడలు ముగింపు సందర్భంగా జరిగిన అభినందన సభలో మండల స్థాయి క్రీడల ఆర్గనైజర్ పి. విద్యాసాగర్ తో పాటు వ్యాయామ ఉపాధ్యాయులైన యనమదల వేణుగోపాల్, బైటి బాబురావు, బి కృష్ణ, ఏం రాము, ఈశ్వర్, పూర్ణచంద్రరావు, మల్లికార్జున్, జనార్ధన్ తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# విద్వేశాలులేని సమాజ నిర్మాణం కోసం సమిష్టిగా కృషిచేద్దాం.

- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా.
- సమాజ హితంకోసం మహమ్మద్ ప్రవక్త బోధనలు దోహదపడతాయి.
- కొత్తగూడెంలో భారీ మిలాద్- ఉన్-నభి జులూస్ నిర్వహించిన ముస్లిం సోదరులు.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),సెప్టెంబర్ 20,**
శాంతి, సౌభ్రాతృత్వం తో కూడిన మార్గంలో పయనించి శాంతిని నెలకొల్పేందుకు మహమ్మద్ ప్రభక్త బోధనలు ఎంతగానో దోహదపడతాయని, తద్వారా విద్వేశాలు లేని నిర్మించుకోవచ్చని, అందుకు ప్రతిఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజైన మిలాద్- ఉన్-నభి పండుగను పురస్కరించుకొని శుక్రవారం డిపో మజీద్ నుంచి రైల్వే స్టేషన్, బస్టాండు మీదుగా రైల్వేస్టేషన్ వరకు, రామవరం మదీనా మజీద్ నుంచి రామవరం సెంటర్ వరకు వేర్వేరుగా జూలూస్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన వివిధ పార్టీల నాయకులు ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం మాట్లాడారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ శ్రమ జీవికి తన చెమట చుక్క ఆరకముందే తన కష్టార్జితాన్ని అందించాలని మహ్మద్ ప్రవక్త సూచనను పాటించాల్సిన అవసరం ఉందన్నారు. మత విద్వేశాలు దేశ పురోగతికి, సమాజ గమనానికి విఘాతం కలిగిస్తాయని, ప్రజాస్వామ్య భారతదేశంలో కులమతాలక తీతంగా కలిసి మెలిసి ముందుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. మహ్మద్ ప్రవక్త చూపించిన ఫిత్రా, జకార్ద్ వంటి నియమాలు పేదవాడి ఆకలిని శ్రమను గుర్తించేందుకు ఏర్పాటు చేసిన వేనని, తన సంపాదనలో కొంతభాగాన్ని పేదల ఆకలి తీర్చేందుకు కేటాయించడం మహెూన్నతమైందన్నారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ సంఘాల రాష్ట్ర నాయకులు, షాదీ ఖానా, ఉర్దూఘం ఆరాధ్యక్షులు నయీమ్ ఖురేషి, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, మహముద్దీన్ ఖాన్, అమీర్ , ముస్లిం మైనార్టీ సంఘాల నాయకులు, మజీద్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పివి కాలనీ సింగరేణి కంపెనీ చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కౌన్సిలింగ్.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),సెప్టెంబర్ 20,**
మణుగూరు ఏరియాలోని పివి కాలనీ సింగరేణి కంపెనీ క్వార్టర్స్ చేంజ్ ఆఫ్ కౌన్సిలింగ్ ప్రక్రియ శుక్రవారం పైలట్ కాలనీ ఎంవిటిసి నందు హౌస్ ఎలట్మెంట్ కమిటీ ద్వారా నిర్వహించబడినది. ఏరియా సింగరేణి ఉద్యోగులు కుటుంబ సౌకర్యార్థం ప్రస్తుతం ఉన్న క్వార్టర్స్ కు బదులు పివి కాలని నందు ఖాళీగా ఉన్న క్వార్టర్స్ ను కేటాయింపు కోరకు 114 క్వార్టర్లకు గాను 87 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. ఎంసి క్వార్టర్స్ 8 మంది తీసుకున్నారు. మిగితా క్వార్టర్స్ 20 మంది తీసుకున్నారు. ఏరియా జనరల్ మేనేజర్ జి దుర్గం రామ చందర్ ఆదేశాల మేరకు చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కౌన్సిలింగ్ నిర్వహించి సీనియారిటీని పరిగణలోకి తీసుకొని ఖాళీగా ఉన్న క్వార్టర్స్ ను అధికారికంగా కేటాయించడం జరిగిందని డిజిఎం (పర్సనల్) ఎస్ రమేశ్ తెలియజేయడమైనది.
ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ ఓ టు జి ఎం వెంగళ రావు , ఏ ఐ టి యు సి యూనియన్ నాయకులు మేకల ఈశర్, ఐ ఎన్ టి యు సి యూనియన్ నాయకులు వి. కృష్ణం రాజు, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, క్వార్టర్స్ సెక్యూరిటీ సిబ్బంది బి. రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం నాయకులు కీర్తిశేషులు ధర్మభిక్షం విగ్రహాన్ని ప్రతిష్ఠాపన స్థలం పరిశీలన



**సి కే న్యూస్ (సంపత్) సెప్టెంబర్ 20:**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో గౌడ సంఘం కార్యాలయం పైన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం పక్కనే గీతా పని వారల సంఘం జాతీయ నాయకులు ప్రజల మనిషి మన నల్లగొండ జిల్లారెండు పర్యాయాలు పార్లమెంటు కు సేవలందించిన మహెూన్న త వ్యక్తి కీర్తిశేషులు కామ్రేడ్ ధర్మ బిక్షం విగ్రహాన్ని పెట్టుటకు నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు గౌడ్, మొరిగాడి.బోందయ్య, ఆలేరు గౌడ సంఘం అధ్యక్షులు గనగాని శంకర్ గౌడ్, సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు దూడల రమేష్ గౌడ్,రాష్ట్ర గౌడసంఘం నాయకులు బాలగోని సత్యనారాయణ గౌడ్,అయిల.సత్తయ్య గౌడ్, చెక్క .వెంకటేష్, మొరిగాడి బాలరాజు గౌడ్ ,లింగం, తదితరులు పాల్గొన్నారు.

# బంగారం దొంగతనం కేసులో ఆరుగురు మహిళలకు జైలు శిక్ష.




**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),సెప్టెంబర్ 20,** బంగారం దొంగతనం కేసులో ఆరుగురు మహిళలకు జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.సుచరిత శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా... జూలూరుపాడు మండలం వెంకన్నపాలెం కు చెందిన జాజిరియా సునీత వేంగనపాలెం క్రాస్ రోడ్డు వద్ద బంగారం షాప్ నడుచున్నది. 13 అక్టోబర్ 2017న బంగారం షాపులో బంగారం కొనేవాళ్ళ రద్దీ ఎక్కువగా ఉన్నది. గుర్తు తెలియని మహిళలు బంగారు నగలు చూసి కొనకుండా వెళ్ళిపోయారు. తనకు అనుమానం వచ్చి సిసి ఫుటేజి చూడగా ఒకరు దొంగతనం చేసిన వస్తువును మరొకరికి ఇస్తూ అలా మొత్తం అందరు కలిసి వెళ్లిపోయారు. వెండి పట్టీల విలువ 7వేల రూపాయలు చేస్తుంది. వారిని వెతకగా దొరకనందున జూలూరుపాడు పోలీస్ వారికి ఫిర్యాదు చేయగా అప్పటి సబ్ ఇన్స్పెక్టర్ పి. శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని అప్పటి వరంగల్ జిల్లా నరసింహుల పేట మండలము పకీర తండా బొడ్డు తండాలకు చెందిన గుగులోతు కోబి, భూక్య మంక్తి, భూక్య అంకు, భూక్యా సీత, ఆంగోతు రాజి, లాకావత్ కాళీ లు దొంగతనం చేసి చేసినారని వారి దగ్గర వెండి పట్టీలు రికవరీ చేసి , దర్యాప్తు అనంతరం ఆరుగురు మహిళల పై కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశాడు. కోర్టులో ఏడుగురు సాక్షుల విచారించిన అనంతరము వారి పై నేరం రుజువుగా ఆరుగురు మహిళల కు ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు, శిక్ష 500 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసెక్యూషన్ ను విశ్వశాంతి నాగలక్ష్మి లు నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ సబ్ ఇన్స్పెక్టర్ వి. రామమూర్తి, లైజాన్ ఆఫీసర్ ఎస్కే అబ్దుల్ ఘని, (కోర్టు డ్యూటీ ఆఫీసర్) పీ. ఎస్. జూలూరుపాడు పిసి. పీ.ఉపేందర్ రావు లు సహకరించారు.

# వైరా రిజర్వాయర్ మత్స్యకారుల సొసైటీ సమావేశం



**సి కే న్యూస్ (సైదులు) సెప్టెంబర్ 20:**వైరా రిజర్వాయర్ సొసైటీ అధ్యక్షులు షేక్ రహీమ్ ఉపాధ్యక్షులు షేక్ సైదులు అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో 1200 మంది సభ్యులు పాల్గొన్నారు ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం చెరువులో చేప పిల్లలు చెరువులో పోయటం కొరకు ఎటువంటి దళారులు ప్రమేయం లేకుండా సభ్యులు వారి సభ్యత్వం ప్రకారం వారు పెట్టుబడులు పెట్టుకొని చెరువు నందు చేప పిల్లలు వేయుటకు తీర్మానం చేసుకున్నారు. ఈ తీర్మానానికి సభ్యులందరూ మద్దతు తెలిపారు ఈ సమావేశాన్ని విజయవంతం చేసినందుకు సభ్యులందరికీ అధ్యక్షులు షేక్ రహీం కృతజ్ఞతలు తెలిపారు

# పోలీస్ మరియు ప్రెస్ వాళ్ళము అని బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులపై కేసు నమోదు .



**సీ కే న్యూస్ వాజేడు మండల ప్రతినిధి షేక్ రహీమ్ :** పోలీసులం మరియు ప్రెస్ వారి మంటూ ప్రదాన రహదారి పై వెళ్తున్న వాహనాలను ఆపి, డబ్బులు వసూళ్ళకు పాల్పడుతున్న వ్యక్తులను ములుగు జిల్లా వాజేడు పోలీసులు అరెస్ట్ చేశారు. వాజేడు ఎస్.ఐ. రుద్ర హరీష్ ఈ మేరకు మీడియాకు ప్రెస్ నోట్ ను విడుదల చేశారు. మండలం లోని అయ్యవారిపేట నుండి ఎటు రు నాగారం వైపు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ను ఆపి పోలీసులం , విలేకరులం అని 20 వేల రూపాయలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో ఈ సంఘటన జరిగింది. వారంతా ఎటురునాగారం మరియు, మంగపేట గ్రామాలకు చెందిన పళ్ళ రాంబాబు, పల్నాటి సతీష్, వద్ది కార్తీక్, మల్లెల కమలాకర్, వావిలాల జనార్ధన్ లు తో పాటు వారితో వున్న తాడూరు మధుకర్ అను వ్యక్తులు, మేము పోలీస్, ప్రెస్ రిపోర్టర్లము అని, అందులో వద్ది కార్తీక్ అనే వ్యక్తి తన చేతిలో స్టీలు రాడ్ పట్టుకుని తాను పోలీస్ కానిస్టేబుల్ అని బెదిరించారు. వాజేడు మండలం అయ్యవారి పేట నుండి ఎటురు నాగారం వెళ్తున్న డిసిఎమ్ వ్యానును ఆపి, ఎం.డి సద్దాం హుస్సేన్ అను వ్యక్తిని, 20వేల రూపాయలు ఇవ్వాలని లేకుంటే స్టీల్ రాడ్ తో చంపుతామని బెదిరించారు. అలాగే ఇవ్వకపోతే పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లి కేసు పెడతాము అని , బెదిరించారు. వ్యాన్ దిగి చూడగా, వాళ్ళందరూ ఏటూరునాగారం మరియు మంగపేట అని గమనించి, అటుగా వస్తున్న లారీలను చూసి, అతను అరవగా వాళ్ళందరూ అక్కడి నుండి వారి వాహనాలలో పారిపోయారు .ఈ మేరకు సద్దాం హుస్సేన్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు వాజేడు ఎస్.ఐ. రుద్ర హరీష్ విలేకరులకు తెలిపారు.

# సింగరేణి కార్మికులకు దసరా కానుకగా 33 శాతం లాభాల బోనస్ ప్రకటించిన.

- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు.
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం నికర లాభాలు 4701 కోట్ల రూపాయలు.
- ఇందులో రూ.2,412 కోట్ల లో 33 శాతం (796 కోట్లు) లాభాల బోనస్గా ప్రకటనకౌ
- రూ.2,289 కోట్ల తో సింగరేణి భవిష్యత్, వ్యాపార విస్తరణ ప్రణాళికలు.
- సగటున ఒక్కో కార్మికుడికి ఒక లక్ష 90 వేల రూపాయల లాభాల బోనస్.
- గతేడాది కన్నా రూ.20 వేలు అదనంగా చెల్లింపు
- సింగరేణి చరిత్రలో అత్యధిక బోనస్.
- తొలిసారిగా పొరుగు సేవల సిబ్బందికి లాభాల బోనస్ చెల్లింపునకు నిర్ణయం.
- సగటున రూ.5 వేల వరకు చెల్లింపు.
- సింగరేణి కార్మికుల పనితీరును, సంస్థ ప్రగతిని కొనియాడిన సీఎం, డిప్యూటీ సీఎం.
- కార్మికుల పక్షాన ప్రభుత్వానికి సీఎండీ, కార్మిక సంఘాలు, అధికారుల సంఘాల కృతజ్ఞతలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),సెప్టెంబరు 20,**దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి కార్మికులకు తీపి కబురు తెలిపింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24) సింగరేణి సాధించిన 4701 కోట్ల రూపాయల లాభాలలో సంస్థ వ్యాపార విస్తరణ ప్రణాళికల కోసం రూ.2,289 కోట్ల కేటాయించగా.. మిగిలిన 2412 కోట్ల రూపాయల పై 33 శాతాన్ని లాభాల వాటా బోనస్ గా కార్మికులకు చెల్లించనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ప్రకటించారు. శుక్రవారం రాష్ట్ర మంత్రి మండలి సభ్యులతో కలిసి సచివాలయంలో లాభాల బోనస్ను ప్రకటించారు. 33 శాతం వాటా కింద రూ.796 కోట్లను కార్మికులకు లాభాల వాటాగా చెల్లిస్తుండగా ఒక్కొక్క కార్మికుడు సగటున రూ. 1,90,000 వరకు అందుకోనున్నాడు. సింగరేణి చరిత్రలో ఇదే అత్యధిక లాభాల వాటా బోనస్ గా నిలువ నుంది. అలాగే సింగరేణి చరిత్రలో తొలిసారిగా సంస్థ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల బోనస్ ను వర్తింపజేస్తున్నట్లు తెలిపారు.

గతం కన్నా 85 కోట్లు అధికం. 2022 -23 ఆర్థిక సంవత్సరంలో లాభాల వాటా కింద ప్రకటించిన 32 శాతం తో రూ.711 కోట్లను కార్మికులకు పంపిణీ చేయగా ఇప్పుడు 33% తో రూ.796 కోట్లు పంపిణీ చేస్తున్నారు. ఇది అప్పటి కన్నా 85 కోట్లు అధికం. అప్పుడు కార్మికులు సగటున ఒక లక్ష 70 వేల రూపాయలు లాభాల బోనస్ గా అందుకోగా ఇప్పుడు సగటున ఒక లక్ష 90 వేల రూపాయలు అందుకోబోతున్నారు. గత ఆర్థిక సంవత్సరం సంస్థలో అత్యధికంగా 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరపడంతో ఎప్పుడూ లేనంతగా రూ.4701 కోట్ల నికర లాభాలను కంపెనీ ఆర్జించింది.

నాడు లాభాల బోనస్ రూ.2782%ొ% నేడు దాదాపు 2 లక్షలు

1990 దశకంలో తీవ్ర నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేసి లాభాల బాట పట్టించారు. ఈ నేపథ్యంలో కార్మికులకు లాభాల్లో వాటా ఇచ్చి ప్రోత్సహించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. 1999 - 2000 సంవత్సరం లో తొలిసారిగా నాడు వచ్చిన 300 కోట్ల రూపాయల లాభాల్లో 10% అనగా 30 కోట్లను లాభాల వాటా బోనస్ గా ప్రకటించారు. నాడు కంపెనీలోఉన్న ఒక లక్ష 8 వేల మంది కార్మికులకు ఒక్కొక్కరికి సగటున 2,782 రూపాయలను లాభాల వాటాగా పంపిణీ చేశారు. ఈ సాంప్రదాయం దేశంలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థలోనూ లేదు.. నాటి నుంచి సింగరేణి సంస్థ వరుసగా లాభాలు సాధిస్తూ దేశంలోనే అగ్రస్థాయి సంస్థగా నిలుస్తూ వస్తోంది. దీనితో లాభాల వాటా బోనస్ను ప్రతీ ఏడాది పెంచుతూ కార్మికులకు పంపిణీ చేస్తున్నారు. 2013-24లో లాభాల బోనస్ 20 శాతాని కి పెరిగింది. అప్పుడు సగటున కార్మికుడు 13,751 రూపాయలు లాభాల వాట బోనస్ గా స్వీకరించాడు. 2021- 22 నాటికి ఇది 30 శాతానికి చేరుకోగా సగటున కార్మికుడికి సుమారు 90 వేల రూపాయల వరకు లాభాల వాటా అందింది. ఈ ఏడాది సింగరేణి చరిత్ర లోనే అత్యధికంగా 33 శాతం లాభాల వాటా బోనస్ గా ప్రకటించడం వలన మస్టర్లు అధికంగా ఉన్న కార్మికులు 2.5 లక్షలకు పైగా బోనస్ అందుకునే అవకాశం ఉంది. అయితే సగటున మాత్రం 1,90,000 రూపాయలను కార్మికులు అందుకోనున్నారు.

**తొలిసారిగా పొరుగు సేవల సిబ్బందికి కూడా బోనస్...**

సింగరేణి కాలరీస్ చరిత్రలో తొలిసారిగా ఈ ఏడాది పొరుగు సేవల కింద పని చేస్తున్న కాంట్రాక్టు, ఒప్పంద కార్మికుల కూడా లాభాల బోనస్ను చెల్లించాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రకటించారు.. కంపెనీ లో 25 వేల మంది వరకు కాంట్రాక్టు, పొరుగు సేవల సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో గత ఆర్థిక సంవత్సరంలో నిర్ణీత మస్టర్లు పూర్తి చేసిన వారికి నిబంధనల ప్రకారం బోనస్ను చెల్లించనున్నారు. సగటున రూ.5 వేల వరకు లాభాల బోనస్ను కాంట్రాక్టు కార్మికులు పొందే అవకాశం ఉంది.

**బహుముఖ వ్యాపార విస్తరణ..**

ఈ ఏడాది వచ్చిన 4701 కోట్ల రూపాయల లాభాలలో 2289 కోట్ల రూపాయాల ను కంపెనీ విస్తరణ , అభివృద్ధి పనుల కోసం కేటాయిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. కంపెనీ ఆర్థిక సుస్థిరత, భవిష్యత్ కోసం రాష్ట్ర ప్రభుత్వ మార్గ నిర్దేశంలో బహుముఖ వ్యాపార విస్తరణ చర్యలు చేపడుతున్నట్లు ప్రకటించారు.. ఇందులో భాగంగా సోలార్ విద్యుత్తు 1,000 మెగా వాట్లకు పెంచాలని, రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలని, ప్రస్తుత 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో మరో 800 మెగావాట్ల సామర్థ్యం కల సూపర్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, రామగుండంలో తెలంగాణ జెన్కో భాగస్వామ్యంలో 800 మెగావాట్ల ప్లాంట్ను ,ఒడిశాలో 2400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించి ప్రణాళికలను రూపొందించి ముందుకెళ్తున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థలో వీకే ఓసీ, గోలేటి ఓసీ, నైనీ ఓసీలను ఈ ఏడాది ప్రారంభించనున్నట్లు, తద్వారా ఏడాది ఉత్పత్తి లక్ష్యం 72 మిలియన్ టన్నుల కు చేరుకోనుందన్నారు. అలాగే నూతన సీహెచ్పీల నిర్మాణం, కార్మికుల సౌకర్యార్థం క్వార్టర్లు, కార్మికుల పిల్లల కోసం సింగరేణి పాఠశాల ఆధునీకీకరణ, రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు, ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణ, క్యాథ్ ల్యాబ్ల ఏర్పాటు, క్యాంటీన్ల ఆధునికీకరణ, హైదరాబాద్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ వ్యాపార విస్తరణ చర్యలతో కంపెనీకి ఉజ్వల భవిష్యత్ ఉందని, కాబట్టి కార్మికులు, అధికారులు సమర్థంగా పనిచేస్తూ రక్షణ, నాణ్యతతో కూడిన ఉత్పత్తికి కృషి చేసి సంస్థను ఆదర్శవంతమైన కంపెనీగా తీర్చిదిద్దాలని కోరారు.

సమావేశంలో రాష్ట్ర మంత్రులు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, గడ్డం వినోద్, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ప్రేంసాగర్ రావు, ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య సంఘ నాయకులు జనక్ ప్రసాద్, అధికారుల సంఘం నాయకులు లక్ష్మీ పతి గౌడ్, జీఎంలు సుభానీ, రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు లాభాల వాటా ను ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కి, ఉప ముఖ్యమంత్రి కి కార్మికుల తరఫున సంస్థ సీఎండీఎన్.బలరామ్ కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణి సంస్థలో గల 41,500 మంది కార్మికులు, అధికారులకు ఈ బోనస్ ను దసరా పండుగకు ముందు చెల్లించేందు ఏర్పాట్లు చేయాలని ఆయన సిబ్బంది, ఆర్థిక శాఖలకు ఆదేశాలు జారీ చేశారు.

# మిస్టరీ సాధించిన చేగుంట పోలీసులు






**సెప్టెంబర్ 21 ( సీకే )చేగుంట :**మెదక్ జిల్లా చేగుంట శనివారం తేదీ 14. 09.2024 నాడు ఫిర్యాదురాలు అయిన జరుపుల దేవి భర్త: శీను గ్రామం ఉసిరిక పల్లి శివంపిట మండల్ మెదక్ జిల్లా గారి ఫిర్యాదు మేరకు ఫిర్యాదురాలి తల్లి అయిన మాలోతు లలిత భర్త రామ్ సింగ్ వయస్సు:48 సంవత్సరాలు, కులం:ఎస్టి లంబాడి వృత్తిఃవ్యవసాయము గ్రామం సాజులాండ చెట్ల తిమ్మాయిపల్లి అదృశ్యమైనట్లు దరఖాస్తు ఇవ్వగా సేరం సెంబర్ 298/2024 ఎందు మిస్సింగ్ కేసు నమోదు చేసినాము.మృతురాలు తేదీ 11.09.2024 నాడు ఉదయం 11 గంటలకు మాసాయిపేటకు బ్యాంకు నుండి డబ్బులు తీసుకోవడానికి వెళ్తున్నానని ఇంటి నుండి బయలుదేరినది కానీ తేదీ 14.09.2024 వరకు ఇంటికి రానందున ఫిర్యాదు చేసినారు. సేరస్తులైన వల్లపు కనకయ్యఏ వడ్డే కనకయ్య ,వల్లెపు ప్రమీల ఏ వడ్డే ప్రమీల నివాసం : గ్రా. ఘన్పూర్,మం.తూప్రాన్ లు మృతురాలికి తూప్రాన్ లోని కళు ౣ దుకాణంలో పరిచయమై మృతురాలు శరీరంపై గల బంగారు వెండి వస్తువులను కాచేయాలని ఉద్దేశంతో మృతురాలితో పరిచయం చేసుకుని రెండు మూడు సార్లు కళు ౣ దుకాణంలో మృతురాలతో కలిసి కళ్ళు తాగి అమె యొక్క ఫోన్ నెంబర్ తీసుకుని ఒక పథకం ప్రకారం తేదీ తేదీ 11.09.2024 నాడు ఉదయం సేరస్తులు మృతురాలికి ఫోన్ చేసి యాదగిరిగుట్ట తీసుకెళ్తామని చెప్పే నగలు వేసుకొని గుడికి రావాలని మృతురాలికి తెలుపగా, మృతురాలు తూప్రాన్ కి రాగా సేరస్తులు వారి యొక్క ఫ్యాషన్ ప్రో బైక్ నెంబర్ %ూ 35.దీ%.6428 మృతురాలని ఎక్కించుకొని తూప్రాన్ నుండి యాదగిరిగుట్ట వెళ్ళు మార్గమధ్యలో జగదేవ్పూర్ దాటిన తర్వాత పీర్లపల్లి అడవి ప్రాంతానికి మృతురాలుని తీసుకెళ్లి గొంతు నులిమి చంపివేసి ఆమె శరీరంపై గల వెండి కడియాలు, వెండి మట్టెలు మరియు బంగారు చెవి కమ్మలు మరియు మృతురాలి సెల్ఫోన్ లను దొంగలించుకొని మరల తిరిగి వారి యొక్క బైక్ పై ఇంటికి వచ్చినారు తదుపరి అట్టి వెండి కడియాలు వెండి మెట్టెలు బంగారు చెవి కమ్మలు తూప్రాన్ లోని పాన్ బ్రోకర్స్ వద్ద కుదువ ఎటట్టి, ఒక స్లిండర్ ప్లస్ బైక్ కొనుక్కున్నారు. పైన తెల్పిన బంగారు మరియు వెండి ఆభరణాలు స్వాదీనం చేసుకోవడం జరిగింది అట్టి బంగారు మరియు వెండి యొక్క విలువ సుమారు రూ.33,000/- లు. ఈ కేసు ను చేదించడంలో దాక చక్యంగా వ్యవహరించిన సి .ఐ వెంకట రాజాగౌడ్, చేగుంట యస్.ఐ చైతన్య కుమార్ రెడ్డి, యచ్.సి సత్తయ్య పి.సి లు భాస్కర్, గట్టిప్, రమేశ, మహేశ్ మరియు హోం గార్డు అర్వద్ లను. తూప్రాన్ డి.యస్.పి, యస్. వెంకట్ రెడ్డి.. విరిని అభినందించారు

# యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలో తాగునీటి సమస్యను పరిష్కరించిన .తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల ఐలయ్య



**సి కే న్యూస్ యాదగిరిగుట్ట (మధు ) సెప్టెంబర్ 20 :**గుండాల మండలంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో రెండు బోర్లకు మరమ్మతులు చేయించారు.మరో నూతన బోరు వేయగా నీళ్లు ఎక్కువగా రావటం తో అక్కడి నాయకులు,ప్రజలు సంతోషం వ్యక్తం చేసి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కొబ్బరికాయ కొట్టి నీటిని విడుదల చేశారు.

# ఖమ్మం మున్నేరు వరద బాధితుల సహాయార్థం సాంస్కృతిక సారథి కళాకారుల చేయూత



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, సెప్టెంబర్ 20:**ఇటీవలి మున్నేరు వరదల ముంపు బాధితుల సహాయార్థం సాంస్కృతిక సారథి, జానపద కళాకారులు తమ వంతుగా ఖమ్మం నగరంలో గత మూడు నాలుగు రోజులుగా విరాళాలు సేకరించగా, వచ్చిన 50 వేల రూపాయలను శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ముజ్మిల్ ఖాన్ కి అందజేశారు. వరద బాధిత నిరుద్యోగ కళాకారులు పిడియాల రాము, పెద్దపాక విజయ్, గుడిపల్లి పుల్లారావు, ఎల్తూరి మధు, చల్లా రంగ, మొగిలి వెంకటేశ్వర్లు, వరియోగుల స్వాతిలతో పాటు, బాధిత కళాకారులకు నిత్యావసర సరుకులు అందజేశారు. వరద బాధితుల సహాయార్థం అందించిన 50 వేల రూపాయల సహాయానికి జిల్లా కలెక్టర్, సాంస్కృతిక సారథి, జానపద కళాకారులను ఈ సందర్భంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో పల్లె పాటల పాగి, మిమిక్రీ సుధాకర్, పరకాల అజయ్, కాల్వకట్ల జాన్, పీడియాల లక్ష్మణ్, ఆరెంపుల సతీష్, ఆదెర్ల శంకర్, అద్దంకి నరసింహారావు, మేడ ముత్తయ్య, బొమ్మెర ముత్యం, నకిరికంటి వెంకటేశ్వర్లు, డప్పుశివ, గుంటి గురవయ్య, పోలూరి రాము, నారాటి చంద్రమోహన్, గాదరి వెంకట్ తదితర కళాకారులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి విరాళం అందజేత



**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య సెప్టెంబర్ 20** హుజూర్నగర్ పట్నంలోని లింగీ రోడ్ లో ఉన్నటువంటి ఈ శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాల జరిగిన సందర్భంగా ఆనాడు కీతవారిగూడెం గ్రామానికి చెందిన నామోజు నరేష్ హేమలత దంపతులు హామీఇవ్వగా శుక్రవారం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ అభివృద్ధి కొరకు ఆయన వంతుగా 10 వేల రూపాయలు అధ్యక్షునికి అందజేయమైనది అనంతరం జరిగిన కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కార్పెంటర్ అధ్యక్షులు స్వర్ణకారుల అధ్యక్షులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కొరకు మా వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చేపూరి నరసింహ చారి పెద్దోజు సూర్యనారాయణ చారి నామోజు నరేష్ బంగారు బ్రహ్మచారి నెమ్మోజు నవీన్ శ్రీపాది రంగయ్య చారి ఆరోజు వీరాచారి అయ్యగారు నవీన్ చారి తదితరులు పాల్గొన్నారు.

## రోప్ వే ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, సెప్టెంబర్ 20:**ఖమ్మం ఖిల్లాపై సందర్శకులు, పర్యాటకులు సౌకర్యవంతంగా వెళ్లే విధంగా రోప్ వే ఏర్పాటుకు గాను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పర్యాటక శాఖ, రెవెన్యూ, సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం స్థల పరిశీలన చేసారు.

ఖమ్మం ఖిల్లా ప్రాంతం పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడంలో భాగంగా జాఫర్ బావి పునరుద్ధరణతో పాటు, పర్యాటకులు సురక్షితంగా ఆహ్లాదకర వాతావరణంలో ఖిల్లా పైకి వెళ్లి సందర్శించే విధంగా రోప్ వే ఏర్పాటుకు గాను జాఫర్ ఉద్ దౌల మెట్ల బావి వద్ద, ఖిల్లా మెట్ల వద్ద ఉన్న స్థలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రోప్ వే ఏర్పాటుకు, పార్కింగ్ ఏర్పాటుకు ఎంత మేరకు స్థలం అవసరం ఉంటుంది, ఏర్పాట్ల నిమిత్తం ఎక్విప్మెంట్ తరలించేందుకు రవాణాపై సంబంధిత అధికారులతో చర్చించారు.

ఈ స్థల పరిశీలనలో కలెక్టర్ వెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి, వైజాగ్ రోప్ వే కన్సల్టెంట్ కన్వీనర్ వెంకట్, కన్సల్టెంట్ రామకృష్ణ, అధికారులు, తదితరులు ఉన్నారు.

## ఇసుకాసురుల ఇష్టారాజ్యం... రంగాపురంలో అక్రమంగా ఇసుక డంపులు...

● బీఆర్ఎస్ నాయకుల ఇష్టారాజ్యం...



**పెబ్బేరు సెప్టెంబర్20 (సి కే న్యూస్)**పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామంలో కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ఇసుక మాఫియా పెట్రేగి పోతుంది. స్థానికంగా ఉన్న నది నుంచి పెద్ద మొత్తంలో ఇసుకను తవ్వి డంపులు చేసుకొనిస్తానిక బీఆర్ఎస్ నాయకులు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముఠాగా ఏర్పడి కొంతమంది ఇసుక దందా చేసేవాళ్లు రంగాపురం శివారు ప్రాంతాల్లో ఏకంగా భారీ మొత్తంలో ఇసుక డంపులను ఏర్పాటు చేస్తున్నారు. మండలంలోని రంగాపురం గ్రామంలోని ఇద్దరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా భారీ మొత్తంలో ఇసుకను డంపు చేశారు. చుట్టుపక్కల వాగుల నుంచి, కృష్ణానది నుంచి సేకరించిన ఇసుకను కొన్నిచోట్ల ఈ విధంగా డంపు చేసి అర్ధరాత్రులు వేరే ప్రాంతాలకు తరలించుకు పోతున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇదేదందా చేసిన రంగాపురం గ్రామానికి
చెందిన ఇద్దరు సదరు వ్యక్తులు ఈ ఇసుక డంపును ఏర్పాటు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. మండలంలోని కృష్ణానది నుండి తీసుకువచ్చిన ఇసుకను భారీ మొత్తంలో డంప్ చేసి తర్వాత అర్ధరాత్రిలు జెసిబి సాయంతో ట్రాక్టర్లు టిప్పర్ల ద్వారా గద్వాలకు తరలిస్తున్నట్లుగా తెలుస్తుంది. ఈ రవాణా కోసం మూడు ట్రాక్టర్లను రెండు టిప్పర్లను వినియోగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ అక్రమ దందా ను కట్టడి చేయడంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు శ్రద్ధ చూపాలని,ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ అక్రమంగా ఇసుకను తరలించకపోతున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆలేరు మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం..





**-ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య**

**సి కే న్యూస్ (సంపత్) సెప్టెంబర్ 20:**68వ పాఠశాలల క్రీడలలో భాగంగా ఆలేరు మండల స్థాయి క్రీడా పోటీల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆలేరు మండల విద్యాధికారి జంగిటి కృష్ణ అధ్యక్షత వహించారు..ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటు వంటి మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య క్రీడలను ప్రారంభించడం జరిగింది..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...క్రీడలు మానసిక శారీరక వికాసానికి దోహధం చేస్తాయని,జిల్లా రాష్ట్రస్థాయి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఆలేరుకు పేరు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలేరు ఎంపీడీవో సత్య ఆంజనేయ ప్రసాద్ ఆలేరు ఎస్సై రజినీకాంత్ ఎస్ టి ఓ కట్టా శ్రీనివాస్ ఎస్ జి ఎఫ్ సెక్రటరీ బెజ్జం బాలకృష్ణ బహుమతుల దాత బండి రాజుల శంకర్ మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు మండలంలోని అన్ని పాఠశాలల నుండి దాదాపుగా 500 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి%డ%గ్యాస్ సబ్సిడీ పత్రలను అందజేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య





**సి కే న్యూస్ (సంపత్) సెప్టెంబర్ 20:**యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిగుట్టలోని ప్రభుత్వ విప్ కార్యాలయంలో ఆలేరు నియోజకవర్గం లోని తుర్కపల్లి బొమ్మలరామారం యాదగిరిగుట్ట రాజాపేట మండలాలకు సంబంధించిన లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కళ్యాణ లక్ష్మి చెక్కులను,మహాలక్ష్మి పథకం కింద మహిళలకు అందించే 500లకే గ్యాస్ సబ్సిడీ పత్రాలను పంపిణీ చేశారు.ఆలేరు నియోజకవర్గంలోని బొమ్మలరామారం మండలంలో 17 చెక్కులను,తుర్కపల్లి మండలంలో 28 చెక్కులను,రాజపేట మండలంలో 29 చెక్కులను,యాదగిరిగుట్ట మండలంలో 34 చెక్కులను.అందజేయగా మొత్తం 108 చెక్కులను అందజేశారు.




## గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు-డాక్టర్ సుధాకర్

అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా పోషన అభినయన్ కార్యక్రమం




**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య సెప్టెంబర్ సెప్టెంబర్ 20**
గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యవంతంగా జన్మిస్తారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుధాకర్ అన్నారు.
మఠంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో
పోషన అభినయన్ కార్యక్రమం డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ పిల్లలు, కౌమా రదశలో ఉన్న బాలికలు, గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులలో పోషకాహార లోపం యొక్క సవాళ్లను పరిష్కరించడానికి పోషకాహార తీసుకోవాలని, బలమైన ఆహారం తీసుకోవడం వల్ల పిల్లల్లో ఎగుదల ఉంటుందని, పిల్లల పౌష్టికంగా ఉంటారని, అలాగే గర్భిణీ స్త్రీలు కూడా పౌష్టికాహారం తీసుకుంటే పుట్టబోయే బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ వసంతలక్ష్మి ఏఎన్ఎంలు , ఆశా కార్యకర్తలు అంగన్వాడి టీచర్లు గర్భిణీ స్త్రీలు, అంగన్వాడి ఆయాలు, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ నూతన అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను సన్మానించిన పెబ్బేరు మండల కాంగ్రెస్ శ్రేణులు...

వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ భవన్ తరలిన నాయకులు



**పెబ్బేరు సెప్టెంబర్20 (సి కే న్యూస్)**హైదరాబాద్ గాంధీ భవన్ లో నూతనంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా ఎన్నికయినా బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ని శుక్రవారం గాంధీ భవన్ లో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆధ్వర్యంలో కలిసి,ఘనంగా సన్మానించి,అభినందనలు తెలిపారు,అనంతరం పార్టీని ప్రభుత్వాన్ని సమన్వయం చేసి ముందుకు నడిపించాలని ఎమ్మెల్యే నూతన టీపీసీసీ అధ్యక్షున్ని కోరారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలలో జిల్లా పరిషత్ బాలికల ప్రతిభ

**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య సెప్టెంబర్ 20:** హుజూర్నగర్ మండల



స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సీనియర్ కబడ్డీ విభాగానందు నందిని భార్గవి అనూష అశ్రీన్ మరియు సీనియర్ కోకో విభాగానందు మహేశ్వరి రక్షిత జూనియర్ కబడ్డీ విభాగనందు ప్రవల్లిక జూనియర్ కోకోనందు కోటేశ్వరి మండల స్థాయి పోటీలలో సీనియర్ బాలికల యందు ప్రథమ బహుమతి గెలుపొంది హుజూర్నగర్ డివిజన్ కు ప్రాతినిధ్యం వహించుటకు ఎనిమిది మంది బాలికలు ఎంపికైన సందర్భంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం డి అబ్దుల్లాతీఫ్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీ అంజనార్ధన్ రెడ్డి మరియు పాఠశాల ఉపాధ్యాయులు ఎంపిక కాబడిన విద్యార్థులకు శుభాభినందనలు తెలియజేశారు.

## 87 కేసులలో జరిమానాలు విధించిన జూనియర్ సివిల్ జడ్జి



**సికె న్యూస్ సూర్యాపేట జిల్లా ప్రతినిధి రామయ్య సెప్టెంబర్ 20:**87 కేసులలో తమ నేరాన్ని అంగీకరించిన నిందితులకు జరిమానాలు విధిస్తూ హుజూర్ నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ శుక్రవారం తీర్పు చెప్పారు.
మద్యం సేవించి వాహనాలు నడిపిన 74 కేసులలోని నిందితులతో పాటు వివిధ నేరాలకు పాల్పడిన 13 కేసులలోని నిందితులు న్యాయమూర్తి ముందు తమ తమ నేరాలను అంగీకరించటంతో మొత్తం 87 కేసులలో 1,88,200 రూపాయల జరిమానాలు విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పారు.జరిమానాల పైకాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని న్యాయమూర్తి పేర్కొన్నారు.

# పాలేరు ఎడమ కాల్వ కెనాల్ బెడ్ పనులు పూర్తి చేసి నీళ్ళందించాలి.....

**యుద్ధ ప్రాతిపదికన రాత్రి వరకు పనులు పూర్తి చేసి పంట పొలాలకు నీళ్లు వదలాలి**

**పాలేరు ఎడమ కాల్వ కెనాల్ బెడ్ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**



సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం :యుద్ధ ప్రాతిపదికన పాలేరు ఎడమ కాల్వ కెనాల్ బెడ్ పనులు రాత్రి వరకు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందజేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

శుక్రవారం పాలేరు ఎడమ కాల్వ కెనాల్ బెడ్ పనులు జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. కెనాల్ బెడ్ 6 మీటర్ ల మేరకు పనులు చేయాల్సి ఉండగా, మూడు మీటర్ లకు పైగా పనులు పూర్తి అయినట్లు ఇర్రిగేషన్ సిఇ విద్యాసాగర్ కలెక్టర్ కు తెలిపారు. కెనాల్ బెడ్ పనులు రాత్రి వరకు పూర్తి చేసి వెంటనే రైతులకు సాగునీరు వదలాలని కలెక్టర్ ఆదేశించారు.

పనుల పరిశీలన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట ఇరిగేషన్ ఇఇ అనన్య, అధికారులు, తదితరులు ఉన్నారు.

## TWPAA & TASS చిత్రకారుల జేఏసీ ఆధ్వర్యంలో వరద బాధిత చిత్రకారులకు చేయూత




సికె న్యూస్ ప్రతినిధి:ఖమ్మం పట్టణంలో మొన్న వచ్చినటువంటి వరదల కారణంగా అనేక కుటుంబాలు పూర్తిస్థాయిలో నష్టపోయారు . నష్టపోయిన కుటుంబాలలో ఖమ్మం పెయింటింగ్ చిత్రకారుల (ఆర్టిస్ట్) కుటుంబాలు అనేకంగా ఉన్నాయి . చిత్రకలనే నమ్ముకొని జీవనం సాగిస్తున్నటువంటి కళాకారుల బతుకుల్లో కన్నీరే మిగిలింది . ముంపు ద్వారా నష్టపోయిన చిత్రకారుల కుటుంబాలను ఆదుకోవడం కోసం రాష్ట్ర నలమూలల నుంచి చిత్రకారులు మేము సైతం నీకోసం అని కొంత విరాళాలను సేకరించి ప్రతి బాధిత కుటుంబానికి అర క్వింటా బియ్యం , నెలరోజులకు సరిపడా నిత్యావసర సరుకులు ఆ చిత్రకారుల కుటుంబాలకు అందజేసి చేయూతను అందించారు . ఈ సందర్భంగా చిత్రకళ జేఏసీ రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భాగస్వామ్యంలో కీలకపాత్రను పోషిస్తున్నటువంటి మా చిత్రకలను ప్రోత్సహించడంలో ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని ఇతర వృత్తి కళాకారులను గుర్తించినట్లుగా వారికి కేటాయించిన కార్పొరేషన్ నిధులను ఎలాగైతే చేస్తున్నారో కళనే నమ్ముకుని జీవిస్తున్నటువంటి లక్షలాది కుటుంబాలు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నాయని కావున ఇకనైనా మా కళాకారులను గుర్తించి మాకంటూ ప్రత్యేకమైన కార్పొరేషన్ ఏర్పాటు చేసి మా సంక్షేమానికి తక్షణమే 1000 కోట్ల బడ్జెట్ను కళాకారులకు నిధులు విడుదల చేసి ఉపాధి కోల్పోతున్న చిత్రకళా కార్మికులకు తక్షణమే పని కల్పించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఇండ్లు లేని చిత్రకారులకు స్థలం కేటాయించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని , చిత్రకళా రంగంలో అనేక సేవలందించిన కళాకారులు వయసు మీద పడి పని చేయలేని పరిస్థితిలో ఉన్నారు 50 సంవత్సరాలు దాటిన కళాకారులకు పెన్షన్ రూపంలో ప్రభుత్వం ఆదుకోవాలని , చిత్ర కళాకారుల కుటుంబాల పిల్లలకు కార్పొరేషన్ స్థాయిలో ఉచిత విద్యను అందించాలని , విద్య హక్కు చట్టం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాయింగ్ టీచర్లను భక్తి చేయాలని , ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో చిత్రకారులకు ఉన్న అవకాశాలను ప్రతిదీ గుర్తించి వారికి కల్పించి వారిని ఆదుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు . ప్రభుత్వాలు మమ్మల్ని గుర్తించని ఎడల మా జేఏసీ ఆధ్వర్యంలో ఉధృతమైన పోరాటాలు కొనసాగిస్తామని తెలియపరిచారు . ఇట్టి కార్యక్రమంలో చిత్రకళ జేఏసీ రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్ , గాజుల శ్రీరామ్ , మీసాల నాగేశ్వరరావు , గంజి వార్ రామకృష్ణ , దాసరి సీతారాములు , కొత్తూరి మోహన్ , మైదం మల్లేష్ , కొమ్ము ప్రకాష్ , మాడిశెట్టి బాలకృష్ణ , దాసరి బిక్షం , జంగిలి భరత్ , యాదన్ రావు , మానుమల్ల కిరణ్ , ఉపేంద్ర చారి , కుటుంబరావు , కళ్యాణం రవి , శరత్ , వీరభద్రం , షఫీ , సాయి , రాయి విష్ణు , ఖమ్మం చిత్ర కళాకారులు ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని నిర్వహించారు .

# శ్రీ స్వామివారి సన్నిధిలో ఆండాళ్ అమ్మవారి ఉంజల్ సేవ.

**స్వామివారి నిత్య రాబడి రూ.13.42 లక్షలు.**



సి కె న్యూస్ యాదగిరిగుట్ట (మధు ) సెప్టెంబర్ 20: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో ఆండాళ్ అమ్మవారికి ఉంజల్ సేవ మరియు స్వామి అమ్మవార్ల జోడు సేవ ఆలయ అర్చకులు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఉదయం అభిషేకం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి ఉంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉంజల్ సేవను మరియు స్వామి అమ్మవార్ల జోడు సేవను ఆలయ పురవీధులలో ఊరేగించి భక్తులకు కనువిందు చేశారు. అనంతరం భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారి ఆలయ నిత్య రాబడిలో భాగంగా శుక్రవారం రోజున రూ.13,42,641,ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు, శ్రీధర్చార్యులు, నరేష్చార్యులు , రాకేష్చార్యులు, వినయ్ కుమార్ చార్యులు, ఆలయ ఏఈవో జూశేట్టి కృష్ణ, సూపరిడెంట్ రామారావు, ఇన్చార్జ్ కృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై బ్యాంకర్లు దృష్టి సారించాలి....



**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి**

**బ్యాంకర్లతో డీసీసీ, డి.ఎల్.ఆర్.సి. సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్**

సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, సెప్టెంబర్ 20: ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై బ్యాంకర్లు దృష్టి సారించి, వాటిని విజయవంతం చేసేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

శుక్రవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి బ్యాంకర్లతో డీసీసీ, డి.ఎల్.ఆర్.సి. సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, రుణమాఫీ జరిగిన రైతులకు సదరు ఫలితం దక్కేలా రుణాలు రెన్యువల్ చేయడం, వరద బాధితులకు వస్తున్న సహాయ సొమ్ము లావాదేవీలు త్వరితగతిన పూర్తి చేయడంలో బ్యాంకర్ల పని తీరును కలెక్టర్ ప్రశంసించారు. బ్యాంకర్ల సహకారంతో వరద బాధితులకు ప్రభుత్వ సహాయం త్వరగా అందించామని అన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద యూనిట్ల గ్రౌండింగ్ విజయవంతంగా చేశామని, ప్రస్తుతం గ్రౌండ్ చేసిన యూనిట్లకు అవసరమైన సహాయ సహకారాలు, సలహాలు, ఆర్థిక అక్షరాస్యత అందించాలని కలెక్టర్ సూచించారు.

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద యూనిట్లు ఏర్పాటు చేసిన స్వశక్తి మహిళా సంఘాలతో బ్యాంకర్లు అవగాహన కార్యక్రమం చేపట్టి ఖాతాల నిర్వహణ, ప్రభుత్వ పన్నులు, వ్యాపారం నిర్వహణ, విస్తరణకు చేయాల్సిన కృషి, మొదలగు వాటిపై ట్రైయినర్లు వివరించేలా చూడాలని అన్నారు.

జిల్లాలో యువత, మహిళలు ముద్రా రుణాలు, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ఉపాధి కల్పన మొదలగు పథకాల ద్వారా ప్రారంభించిన యూనిట్ల స్థితిగతుల సమీక్ష చేయాలని అన్నారు. వ్యవసాయ ఆధారిత యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తిగా ఉన్న రైతులకు అవసరమైన సలహాలు అందించాలని అన్నారు.

బ్యాంకర్లు క్షేత్రస్థాయిలో నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పాలసీలను వివరించాలని అన్నారు. మండల సమాఖ్య సంఘాలతో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, రుణమాఫీకి సంబంధించి సాంకేతికత సమస్యలు ఉన్న బ్యాంకు ఖాతాల వివరాలను సంబంధిత బ్యాంకు మేనేజర్ లు అప్ డేట్ చేయాలని అన్నారు. రుణమాఫీ పూర్తయిన రైతులకు పంట రుణాలు జారీపై దృష్టి సారించాలని అన్నారు.

చిన్న సూక్ష్మ తరహా పరిశ్రమల ఏర్పాటుకు బ్యాంకర్లు సంపూర్ణంగా సహకరించాలని, ముద్ర రుణాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నూతన మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకొని రుణ పరిమితి పెంచాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రజలలో ఆర్థిక అక్షరాస్యత పెంచే దిశగా క్యాంపులను విస్తృతంగా నిర్వహించాలని బ్యాంకర్లకు సూచించారు.

ఈ సమావేశంలో డిఆర్డీవో ఆర్. సన్యాసయ్య, ఎల్డిఎం శ్రీనివాస్ రెడ్డి, ఎస్బిఐ ఆర్ఎం లింగ స్వామి, యుబిఐ ఏజిఎం సుధాకర్, అదనపు డిఆర్డీవో నూరొద్దీన్, బ్యాంక్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పక్కా ప్రణాళికతో ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు సన్నద్ధం కావాలి....

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- 4 లక్షల 29 వేల పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనాతో 236 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతుల కల్పన
- ధాన్యం రవాణాకు అవసరమైన వాహనాలను సన్నద్ధం చేయాలి
- సన్న రకాల ధాన్యాన్ని గుర్తించి వాటిని కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు
- ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై సంబంధిత అధికారులతో సమీక్షించిన జిల్లా కలెక్టర్





సికె న్యూస్ ప్రతినిధి ఖమ్మం, సెప్టెంబర్ 20: జిల్లాలో ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2024-25 ధాన్యం పంట పక్కా ప్రణాళికతో కొనుగోలు చేసేందుకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.

శుక్రవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై అదనపు కలెక్టర్ లు డా. పి. శ్రీజ, డి. మధుసూదన్ నాయక్ లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.

వానాకాలం ధాన్యం కొనుగోలుకు సంబంధించి రూపొందించుకున్న ప్రణాళిక, అందుబాటులో ఉన్న మౌళిక వసతులు, తదితర అంశాలను అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏ మాసంలో ఎంత ధాన్యం దిగుబడి కొనుగోలు కేంద్రాలకు వస్తుందో మండలాల వారీగా ముందస్తుగానే ప్రణాళిక తయారు చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సమర్థవంతంగా పని చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం యంత్రాలను పరీక్షించాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం వచ్చే షెడ్యూల్ ప్రకారం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌళిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, తూకం యంత్రాలు, టార్పాలిన్ మొదలగు వసతులు ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం దిగుబడి ఆధారంగా అవసరమైన మేర గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండాలని అన్నారు.

ధాన్యం కొనుగోలు దగ్గరే ధాన్యం నాణ్యతను కట్టుదిట్టంగా పరిశీలించాలని, రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు ఉండడానికి వీలు లేదని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 6 లక్షల 77 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉందని, ఇందులో 4 లక్షల 29 వేలకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని, వీటి కొనుగోలుకు 236 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అంచనా వేసామని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం సన్న రకాల ధాన్యాలను, ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యులు, వ్యవసాయ విస్తరణ అధికారితో సమన్వయం చేసుకుంటూ గుర్తించాలని, వీటిని కొనుగోలు చేసిన తర్వాత కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని కలెక్టర్ తెలిపారు. సన్న రకం ధాన్యం కొనుగోలు సమయంలో నాణ్యతను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

సన్న రకాల ధాన్యం గుర్తింపు కోసం వ్యవసాయ విస్తరణ అధికారులను పెద్ద కొనుగోలు కేంద్రాలకు కేటాయించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్రాగు నీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేందుకు వీలుగా అవసరమైన మేర వాహనాలు సన్నద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం రవాణాకు కేటాయించిన వాహనాలు దానికి మాత్రమే వినియోగించాలని కలెక్టర్ తెలిపారు.

అక్టోబర్ 1 నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని, ధాన్యం నాణ్యత ప్రమాణాలు, మద్దతు ధర మొదలు అంశాలను వివరిస్తూ కొనుగోలు కేంద్రాల వద్ద బ్యానర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతిరోజు ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నివేదిక సమర్పించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జికి అవసరమైన శిక్షణ అందజేయాలని కలెక్టర్ సూచించారు.

ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, నాణ్యమైన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని, ఈ అంశం రైతులలో విస్తృతంగా వెళ్ళాలని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో డిఆర్డీవో ఆర్. సన్యాసయ్య, డి.సి.ఎస్.ఓ. కె. చందన్ కుమార్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ జి. శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా రవాణాధికారి వి. వెంకట్ రమణ, లీగల్ మెట్రాలజీ డి.ఎల్.ఎం.ఓ. ఐ. విజయ్ కుమార్, డి.ఎం.ఓ. ఎం.ఏ. అలీం, డి.సి.ఎం.ఎస్. బిజినెస్ మేనేజర్ కె. సందీప్, డి.సి.ఓ. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.డి. ఆసిఫ్ అన్వర్, ఎఫ్.సి.ఐ. మేనేజర్ కె. ఎన్. రెడ్డి, అడిషనల్ డి.ఆర్.డి. ఓ. మహమ్మద్ నూరుద్దీన్, డి.పి.ఎం. బి.దర్గయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుడి నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న ఆలేరు ఎమ్మెల్యే





సి కే న్యూస్ యాదగిరిగుట్ట (మధు ) సెప్టెంబర్ 20 యాదగిరిగుట్ట పట్లణ కేంద్రంలోని రామ్ శివాజీ యూత్ ఆధ్వర్యం లో ఏర్వాటుచేసిన గణనాథుడి నిమజ్జన వేడుకల్లో ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మదర్ డైరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్ రెడ్డి. కాంగ్రెస్ మండల ఆధ్యకుడు కాను గు బాలరాజ్ ఉన్నారు.

# జ్యోతి రాయ్ గ్లామర్ బ్లాస్ట్.. అలా చూస్తూ!

కన్నడ బ్యూటీ జ్యోతి రాయ్.. ఒకే ఒక్క సీరియల్ తో రెండు తెలుగు రాష్ట్రాల్లో సూపర్ క్రేజ్ దక్కించుకుంది. మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. గుప్పెడంత మనసు సీరియల్ లో రిషి, వసుధార ఎంత ఫేమస్ అయ్యారో.. ఆమె పోషించిన జగతి పాత్ర కూడా అంతే ఫేమస్ అయ్యింది. చీరకట్టుతో అమ్మ పాత్రలో, టీచర్ పాత్రలో ఎంతో పద్ధతిగా కనిపించింది. తన యాక్టింగ్ తో అందరి దృష్టిని ఆకర్షించింది.

అయితే సినిమాలు, వెబ్ సిరీసులతో ఫుల్ బిజీ అవడంతో ఆ సీరియల్ నుంచి తప్పుకుంది జ్యోతి రాయ్. ఆమె పాత్రను రీప్లేస్ చేయడం ఇష్టం లేని మేకర్స్.. ఆ క్యారెక్టర్ ను చంపేసి ఆమె స్నేహితురాలి పాత్ర అంటూ అనుపమ అనే మరో క్యారెక్టర్ ను క్రియేట్ చేశారు. జ్యోతి రాయ్ లాగా ఆ రోల్ కు ఇంకెవరూ సెట్ కారని అలా చేసినట్లు టాక్. ఇటీవల ఓ యంగ్ డైరెక్టర్ ను రెండో పెళ్లి చేసుకుని కొత్త లైఫ్ స్టార్ట్ చేసింది జ్యోతి రాయ్.

ఇక గత కొన్ని రోజుల నుంచి జ్యోతి రాయ్ సోషల్ మీడియాను ఓ రేంజ్ లో షేక్ చేస్తోంది. నెట్టింట హీట్ పుట్టించే ఫోటో షూట్స్ తో కుర్రకారును మైమరిపిస్తుంటోంది. తన అందాల ప్రదర్శనతో నెటిజన్లను నిద్ర పట్టకుండా చేస్తుంటోంది. పొట్టి బట్టలు, ట్రెండీ ఔట్ ఫిట్స్ లో వయ్యారాలు ఒలకబోస్తుంటోంది. తన గ్లామర్ షోతో నెటిజన్లను ఫిదా చేస్తుంటోంది. ఇటీవల కొత్త ఫొటోస్ ను ఇన్ స్టాలో షేర్ చేసింది జ్యోతి రాయ్.

పొట్టి నిక్కరు, చిన్న టాప్ వేసుకున్న జ్యోతి రాయ్.. సోఫాలో కూర్చుని అందాలు ఆరబోసింది. బ్యాక్ గ్రౌండ్ లో ట్రెండీ మ్యూజిక్ పెట్టింది. తన చూపులతోనే మాయ చేస్తోంది. అదిరిపోయే పోజు ఇచ్చి సెగలు పుట్టిస్తోంది. ప్రస్తుతం వైరల్ గా ఆమె ఫోటోలను చూసి నెటిజన్లు చూపు తిప్పుకోలేకపోతున్నామని కామెంట్లు పెడుతున్నారు. పర్ఫెక్ట్ హీరోయిన్ మెటీరియల్ అంటూ సందడి చేస్తూ లైకుల వర్షం కురిపిస్తున్నారు.

మాట రాని మౌనమిది, శుక్ర సినిమాల డైరెక్టర్ సుకు పుర్వాజ్ ను జ్యోతి రాయ్ రెండో పెళ్లి చేసుకుంది. ఏ మాస్టర్ పీస్ సినిమాను పూర్వాజ్ తెరకెక్కించగా.. జ్యోతి రాయ్ నటించింది. మూవీ టైమ్ లో ప్రేమలో పడి ఆయనను వివాహం చేసుకుంది. పెళ్లి తర్వాత అమ్మడు నెట్టింట మరింత యాక్టివ్ గా ఉంటోంది. తన లుక్స్ తో కన్నడ ఇండస్ట్రీకి చెందిన మేకర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. మరి ఈ బ్యూటీ కెరీర్ ఎలా ఉంటుందో చూడాలి



## ఎల్లి అవ్రామ్ యొక్క పూజ్యమైన లావెండర్ దుస్తుల ఫోటోలు



## గాబ్రియెల్లా డిమెట్రియాడ్స్: తెలుపు రంగులో అద్భుతమైనది!



## కల్కి - యానిమల్ ఎఫెక్ట్.. బడ్జెట్ తోనే షాక్ ఇచ్చేలా.

డార్లింగ్ ప్రభాస్ ఈ ఏడాది 'కల్కి 2898ఏడీ' తో పాన్ ఇండియా లెవల్ లో బ్లాక్ బస్టర్ సక్సెస్ ని అందుకున్నారు. ఈ మూవీ 1100ం కోట్లకి పైగా కలెక్ట్ చేసింది. ఈ ఏడాది ఇండియా నుంచి వచ్చిన సినిమాలలో హైయెస్ట్ కలెక్షన్స్ అందుకున్న చిత్రంగా 'కల్కి 2898ఏడీ' మూవీ నిలిచింది. ఈ సినిమాని 600 కోట్ల బడ్జెట్ తో వైజయంతీ మూవీస్ నిర్మించింది. సినిమాకి పెట్టిన ప్రతి రూపాయి స్క్రీన్ పై కనిపించింది. ఈ సినిమా ఇంపాక్ట్ ప్రభాస్ నుంచి రాబోయే చిత్రాలపై కూడా పడిందనే మాట వినిపిస్తోంది. హీరోలపై ప్రేక్షకుల ఎక్స్ పెక్టేషన్స్ సినిమా సినిమాకి పెరిగిపోతూ ఉంటాయి. కల్కి2898ఏడీ మూవీని ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ తో నాగ్ అశ్విన్ తెరకెక్కించి ప్రభాస్ ఇమేజ్ ని అమాంతం పెంచేశాడు. దీని తర్వాత డార్లింగ్ నుంచి రాబోయే సినిమాల విషయంలో ప్రేక్షకుల ఎక్స్ పెక్టేషన్స్ హై ఎండ్ లోనే ఉన్నాయి. వాటిని అందుకోవడానికి మేకర్స్ ముందు అనుకున్న బడ్జెట్ ల కంటే ఇంకా ఎక్కువ పెట్టుబడి కథలపై పెట్టాల్సి వస్తోంది. సీన్స్ అన్ని కూడా లార్జర్ దెన్ లైఫ్ ఉండేలా డిజైన్ చేయాలంటే కచ్చితంగా ఖర్చుకి వెనుకాడకూడదు. %యాశ్రీంశీ =ఘుం% - అసలు సంపూర్ణేష్ బాబు ఎక్కడ? ఇదిలా ఉంటే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ 'స్పిరిట్' మూవీ చేయబోతున్నారు. ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది ఆఖరులో మొదలయ్యే అవకాశం ఉందనే ప్రచారం నడుస్తోంది. టి-సిరీస్, భద్రకాళీ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాని ముందుగా 300 కోట్ల బడ్జెట్ తో నిర్మించాలని అనుకున్నారు. అయితే ఇప్పుడు ఈ చిత్రానికి ఏకంగా 500 కోట్ల వరకు బడ్జెట్ పెట్టాలని మేకర్స్ భావిస్తున్నారంట. 'యానిమల్' సినిమాతో సందీప్ రెడ్డి 900 కోట్ల కలెక్షన్స్ అందుకున్నారు. 'కల్కి' మూవీతో ప్రభాస్ 1000 కోట్ల క్లబ్ లో చేరాడు. ఈ నేపథ్యంలో ప్రభాస్, సందీప్ ఇమేజ్ ని దృష్టిలో ఉంచుకొని కాన్సెప్ట్ తో ఇంకా హై రేంజ్ లో చెప్పాలంటే బడ్జెట్ ఎక్కువ పెట్టాలని డిసైడ్ అయ్యారంట. అందుకే 500 కోట్ల బడ్జెట్ 'స్పిరిట్' మూవీ పైన పెడుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. టీ సీరీస్ తో పాటు సందీప్ వంగా హోమ్ బ్యానర్ కూడా ఈ సినిమా నిర్మాణంలో భాగం కానుంది. మరో వైపు ఈ సినిమాలో హీరోయిన్ క్యారెక్టర్ కోసం కరీనాకపూర్ ని సందీప్ రెడ్డి సంప్రదిస్తున్నాడంట. ఆమె డేట్స్ కోసం ప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. అలాగే మూవీలో ప్రతినాయకుడి క్యారెక్టర్ కోసం కరీనాకపూర్ భర్త సైఫ్ అలీఖాన్ ని ట్రై చేస్తున్నాడంట. దేవర సినిమాతో సైఫ్ అలీఖాన్ టాలీవుడ్ లోకి అడుగుపెట్టాడు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో మూవీ చేస్తే కచ్చితంగా పాన్ ఇండియా లెవల్ లో నెక్ట్స్ లెవల్ ఇమేజ్ రావడం గ్యారెంటీ. మరి ఇది ఎంతవరకు నిజమో తెలియాలి అంటే మరికొంత కాలం ఆగాల్సిందే.

